ప్రజాశక్తి

బుధవారం 3 జులై 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఇళ్ల నిర్మాణాలు సగమే..!

- పూర్తికాని పేదల ఇళ్లు
- మంజూరైనవి : 56,580
- పూర్తయినవి : 22,083

దేశపాత్రునిపాలెంలో పునాదుల దశలోనే ఉన్న నిర్మాణాలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో గత ప్రభుత్వం నవరత్నాలలో భాగంగా పేదలకు మంజూరుచేసిన 56,580 ఇళ్లలో ఇప్పటికి సగం కూడా పూర్తికాలేదు. ఇళ్ల నిర్మాణాలకు మంజూరుచేసిన దాదాపు రూ.1018 కోట్లలో రూ.537 కోట్లు ఖర్చుచేసి 22,083 ఇళ్లను పూర్తిచేయగలిగింది. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు వివిధ స్థాయిల్లో ఉన్నాయి. ఇంటికి రూ.1.80 లక్షలు పూర్తి సబ్సిడీతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా, ఆశించినట్లు ప్రభుత్వం పూర్తిచేయలేకపోయింది. ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులకు, కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో ఇవ్వకపోవడంతో నిర్మాణాలపై ఆసక్తిలేక వివిధ దశల వరకు నిర్మించి వదిలేశారు. స్లాబ్ వేసిన, నిర్మాణాలు పూర్తయిన ఇళ్లతో కలిపి 25,535 ఇంటి (45 శాతం) నిర్మాణాలయ్యాయి. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మించిన ఇళ్లకు బిల్లులు కూడా ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు రావాల్సివుంది. గత ప్రభుత్వ కాలంలో కట్టుకున్న ఇళ్లకు కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందా? లేదా? అన్న భయం లబ్ధిదారుల్లో నెలకొంది. టిడిపి ప్రభుత్వ కాలంలో నిర్మించిన ఇళ్లకు వైసిపి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడాన్ని గుర్తుచేసుకొని ఆందోళన చెందుతున్నారు.

గృహ నిర్మాణ సంస్థ అధికారులు మాత్రం వివిధ ఇళ్ల పథకాల కింద నిర్మాణాలు చేపట్టిన ఇళ్లకు వాటి నిర్మాణ దశల ఆధారంగా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందని చెబుతున్నారు. గత ప్రభుత్వ కాలంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలపై అధికారులు నివేదిక తయారుచేసి సిద్ధం చేశారు. ప్రభుత్వం ఏ క్షణంలోనైనా ఇళ్ల నిర్మాణ సమాచారం పంపించాలని కోరినా, అందుకు తగిన సమాచారం ముందుగానే గృహ నిర్మాణ సంస్థ అధికారులు తయారుచేశారు. ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం కొద్ది రోజుల వ్యవధిలో సమీక్షించే గత ప్రభుత్వ కాలంలో జిల్లాకు చెందిన మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్ నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణాలు సంతృప్తికరంగా లేవు. అమర్‌నాథ్ నియోజకవర్గం అనకాపల్లి పట్టణ కేంద్రంలో 31 శాతం ఇళ్ల నిర్మాణాలు దాటలేదు. బూడి నియోజకవర్గం మాడుగుల పరిధిలోని చీడికాడ మండలంలో 32 శాతం నిర్మాణాలు జరిగాయి. యలమంచిలి అర్బన్‌లో 60 శాతం ఇళ్ల నిర్మాణాలు జరిగాయి.

మంజూరైన ఇళ్లు	: 56,580
మొదలుపెట్టని ఇళ్లు	: 817
గ్రౌండింగ్	: 54,127
బేస్‌మెంట్‌లోపు	: 14,730
బేస్‌మెంట్	: 11,039
రూఫ్ లెవల్	: 2823
రూఫ్ కాస్ట్	: 3452
పూర్తయినవి	: 22,083

విశాఖ కలెక్టర్ హరీంద్రప్రసాద్

అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్

విశాఖ, అనకాపల్లి కలెక్టర్లుగా హరీంద్రప్రసాద్, విజయకృష్ణన్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, అనకాపల్లి ప్రతినిధి

విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌గా ఎంఎన్.హరీంద్రప్రసాద్‌ను, అనకాపల్లి జిల్లా కలెక్టర్‌గా విజయకృష్ణన్ నియమిస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. విశాఖ జిల్లాకు రానున్న హరీంద్రప్రసాద్ గతంలో నెల్లూరు జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. భారత ఎన్నికల సంఘంలో అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (ఎపి)గా విధులు నిర్వహిస్తూవస్తున్నారు. ఏపి ఎన్నికల జనరల్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎక్స్ అఫీషియో అడిషనల్ సెక్రటరీగా పనిచేశారు. తమిళనాడులోని అరుణాచలం జిల్లాకు చెందిన ఈయన 2015 బ్యాచ్ ఐఎఎస్ అధికారి.

అనకాపల్లి ప్రతినిధి : అనకాపల్లి జిల్లా కలెక్టర్‌గా విజయకృష్ణన్‌ను ప్రభుత్వం నియమించింది. ఇంతవరకు ఈమె సాంఘిక సంక్షేమ డైరెక్టర్‌గా పనిచేశారు. ఇక్కడ పనిచేసిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి పోస్టింగ్ ఇవ్వాల్సివుంది. విజయకృష్ణన్ 2013 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి. కొత్తగా ఏర్పడిన బాపట్ల కలెక్టర్‌గా 2022 ఏప్రిల్ 4 నుంచి 2023 ఏప్రిల్ 13 వరకు పనిచేశారు. తరువాత సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్‌గా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

పాలనాదక్షుడు రవిపట్టాన్‌శెట్టి

2022 ఏప్రిల్ 4న కొత్తగా ఏర్పడ్డ అనకాపల్లి జిల్లాకు రవి పట్టాన్‌శెట్టి కలెక్టర్‌గా వచ్చారు. రెండేళ్లకు పైగా పనిచేసిన ఆయన వివాదరహితునిగా, మంచి పాలనాదక్షునిగా గుర్తింపు తెచ్చుకున్నారు. వివిధ

మోడీతో అవార్డు అందుకుంటున్న రవిపట్టాన్‌శెట్టి (ఫైల్)

మిగతా 2లో..

విశాఖ ఉక్కు పరిరక్షణపై ముఖ్యమంత్రి స్పందించాలి

వార్త 2లో..

ఘనంగా అల్లూరి జయంతి ఉత్సవాలు ప్రారంభం

వార్త 2లో..

పలు పోలీసు కార్యాలయాల్లో సిపి తనిఖీలు

వార్త 2లో..

గంజాయి కేసుల్లో దోషులకు శిక్ష తప్పదు : అనిత

వార్త మెయిన్ 3లో..

విష జ్వరాలను అదుపు చేయాలి

కలెక్టర్‌కు సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం లేఖ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా గొలుగొండ, నాతవరం, రోలుగుంట, రావికమతం, వి.మాడుగుల మండలాల్లో ఏజెన్సీని ఆనుకొని ఉన్న గ్రామాల్లో జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని, విష జ్వరాలను అదుపుచేయాలని కోరుతూ అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మంగళవారం లేఖ రాశారు. గొలుగొండ మండలం బొడ్డేడపాడు, ఎన్.గదబపాలెం, కంతారం, సుద్దలపాలెం, అద్దర్లోవ గ్రామాల్లోనూ, రోలుగుంట మండలం అర్ల పంచాయతీ లోసింగి గ్రామాల్లో జ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు వెంటాడుతున్నాయని, దీనివల్ల దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని వివరించారు. పంచాయతీల్లో నిధులు కొరత కారణంగా బ్లీచింగ్ పౌడర్, దోమల స్ప్రే ఫాగింగ్ కూడా చేయడంలేదని తెలిపారు. పంచాయతీలకు అవసరమైన పారిశుధ్య కార్మికులు లేక కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తీయక దుర్గంధభరితంగా ఉంటున్నాయని వివరించారు. జ్వరాలు ప్రబలుతున్న గ్రామాలను గుర్తించి ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్స్‌లో మలేరియా పరీక్ష కిట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని, గ్రామాలు, పంచాయతీలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్ వార్డులలో పారిశుధ్య పనులు వేగవతంగం చేయాలని, అన్ని ప్రాంతాల్లో దోమల స్ప్రే, ఫాగింగ్ చేయాలని కోరారు.

అంబేద్కర్ స్టడీ సర్కిల్ విద్యార్థుల ప్రతిభ

ఈ ఏడాది ప్రిలిమ్స్‌లో ముగ్గురు విజేతలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యాన రుషికొండలో ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు మంచి ప్రతిభ కనబరుస్తున్నారు. 2024 జూన్ 16న జరిగిన యుపిఎస్సీ ప్రిలిమినరీ పరీక్షా ఫలితాల్లో ముగ్గురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కనపాల రాజామాత్యు (బిటెక్), సేరు తాతయ్య (బిఎస్సీ), స్వర్ణ స్నిగ్ధ (బిటెక్) ఉత్తీర్ణత సాధించారు.

గ్రూప్ -1 లోనూ 12 మంది ఉత్తీర్ణత...

ఇటీవల విడుదలైనటువంటి గ్రూప్-1 ప్రిలిమినరీ ఎగ్జామ్‌లో ఈ బ్యాచ్ విద్యార్థులు 12 మంది ఉత్తీర్ణత సాధించారు. గ్రూప్-2 ప్రిలిమినరీ ఎగ్జామ్‌లో ఈ బ్యాచ్ విద్యార్థులు 80 మంది ఉత్తీర్ణత సాధించడం విశేషం. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు, స్పెషల్ ఆఫీసర్ కె.రామారావు ఆధ్వర్యాన మంగళవారం జరిగిన

ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులను అభినందిస్తున్న అతిథులు

కార్యక్రమంలో ఈ విద్యార్థులను అభినందించారు.

మొదటి బ్యాచ్ నుంచి ప్రతిభావంతుల వెతికితీత...

2022-23 ఫస్ట్ బ్యాచ్ మొదలుకొని ఇప్పటివరకూ 3 బ్యాచ్‌లకు విశాఖలోని డాక్టర్ బిఆర్?అంబేద్కర్ స్టడీసర్కిల్ కోచింగ్ ఇస్తున్నారు. ప్రస్తుతం 3వ బ్యాచ్ 2023 సెప్టెంబర్‌లో ప్రారంభించగా దీనికి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన అర్హత పరీక్ష నందు సుమారుగా 100 మంది విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా సాంఘిక

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

విశాఖ, అనకాపల్లి కలెక్టర్లుగా
ఎంఎన్ హరీంద్రప్రసాద్, విజయకృష్ణన్

రంగాల్లో విశిష్ట సేవలందించినందుకు ప్రైమ్ మినిస్టర్ అవార్డు ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-2022 అవార్డును ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం వర్శిటీ ఆయన సేవలకుగానూ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. పట్టాన్‌శెట్టి తన పరిధిలోని ప్రజా సమస్యలను వెనువెంటనే పరిష్కారం చూపడానికి ప్రయత్నించారు. ఇతర అధికారులను అప్రమత్తం చేసేవారు. జిల్లాల్లో ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకొని పనిచేశారు. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో మంచి కృషిచేశారు.

అంబేద్కర్ స్టడీ సర్కిల్ విద్యార్థుల ప్రతిభ

సంక్షేమ శాఖ ఉప సంచాలకులు/ స్పెషలాఫీసర్ కె.రామారావు ప్రజాశక్తికి తెలిపారు. ఇలా సెలెక్టు అయిన వారిలో 97 మంది కోచింగ్‌లో చేరారు. వారికి సెప్టెంబర్ 2023 నుంచి జూన్ 2024 సుమారు 10 నెలల పాటు యూపిఎస్సీ కోచింగ్ వివిధ సబ్జెక్టుల్లో ఇచ్చినట్లు రామారావు తెలిపారు. ముఖ్యంగా నుభవజ్ఞులైన ఉత్తమ అధ్యాపకులు ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, విశాఖ నుంచి వచ్చి శిక్షణ ఇచ్చారని చెప్పారు. వీరి శిక్షణ కోసం సాంఘిక సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ కె.హర్షవర్ధన్ (ఐఎఎస్), డైరెక్టర్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ విజయకృష్ణన్, జాయింట్ డైరెక్టర్ డి.శ్రీనివాసన్ కృషిచేశారు. మొత్తం శిక్షణ కోసం అకడమిక్ పర్యవేక్షించిన విజిటింగ్ కన్సల్టెంట్ డాక్టర్ యు.సుబ్రహ్మణ్యం, విశాఖ జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ ఎప్పటికప్పుడు తగు సూచనలు, సహకారాలు అందించినట్లు రామారావు పేర్కొన్నారు. ఇతర సీనియర్లు, రిటైర్డ్ ప్రిన్సిపల్ సెక్రటరీ చక్రపాణి, పంజాబ్ కేడర్ కరుణరాజ్ (ఐఎఎస్), శీనయ్య విద్యార్థులకు అమూల్య సలహాలు అదజేసి ప్రోత్సహించారు. సుమారు 10 నెలల వ్యవధిలో 48 మాక్ టెస్ట్‌లు నిర్వహించారు.

రుషికొండ స్టడీ సర్కిల్‌లో అభినందనల వెల్లువ...

ప్రిలిమినరీ ఎగ్జామ్‌లో ఉత్తీర్ణత సాధించిన ముగ్గురు విద్యార్థులకు సీనియర్ ఐఎఎస్ అధికారులు విజయకృష్ణన్, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కరుణరాజ్ (ఐఎఎస్), రిటైర్డ్ ఐఎఎస్ చక్రపాణి విశాఖలోని రుషికొండ స్టడీసర్కిల్‌లో వీరందరినీ అభినందించారు.

విశాఖ ఉక్కు పరిరక్షణపై ముఖ్యమంత్రి స్పందించాలి

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉక్కునగరం : విశాఖ ఉక్కు పరిరక్షణపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించాలని పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, డి.ఆదినారాయణ, రామ్మోహన్‌కుమార్, డేవిడ్, కె.శ్రీనివాస్, శ్రీనివాస్‌నాయుడు విజ్ఞప్తిచేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం నాటికి 1237వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఇఎస్ఎఫ్, ఇఆర్ఎస్, ఇఎండి, సేఫ్టీ, విభాగాల కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి నాయకులు మాట్లాడుతూ, ప్లాంట్‌లో సాధారణ ఉత్పత్తి తీయడానికి సైతం రా మెటీరియల్ కొరత అత్యంత హీన స్థితికి చేరిందని, కేవలం రెండు, మూడు రోజులకు మాత్రమే నిల్వలు ఉన్నాయని, త్వరితగతిన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్పందించాలని కోరారు. ప్లాంట్ సమస్య శాశ్వత పరిష్కారం కోసం సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. గత ఏడు నెలలుగా సకాలంలో ఉద్యోగుల జీతాలు ఇవ్వలేని స్థితిలోకి కంపెనీ నెట్టబడిందన్నారు. ఈ పరిశ్రమ మరింత ఇబ్బందుల్లో పడితే లక్షలాది మంది ఉపాధి కోల్పోతారన్నారు. ఈ శిబిరంలో దాసరి శ్రీనివాస్, కె.కనకరాజు, గంగాధర్, రమణ, సదాశివరావు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలి

కెవిపి చంద్రమౌళి

విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా చూస్తామని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి గెలుపొందిన నాయకులు వారిచ్చిన మాటను నిలుపుకోవాలని సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి చంద్రమౌళి కోరారు. స్టీల్‌ప్లాంట్ ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజాసంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 1188వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో జగదాంబ జోన్ సిఐటియు నాయకులు, హోటల్ వర్కర్స్ యూనియన్ కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే ఉంటుందని కేంద్ర, రాష్ట్ర నాయకులు చెప్పే వరకు తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు, మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి ఉత్సవాలు ప్రారంభం

వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : మన్యం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి ఉత్సవాలు మంగళవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, గురజాడ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యాన అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు గురువారంతో ముగుస్తాయి. మొదటి రోజైన మంగళవారం స్కూల్, కాలేజీ పిల్లలకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు విజ్ఞానకేంద్రం నిర్వహకులు దండు నాగేశ్వరరావు మీడియాకు తెలిపారు. ఈ పోటీలకు నగరం నుంచి దాదాపుగా 200 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారని షార్ట్ ఫిలిం విభాగం బాధ్యతలు చూస్తున్న ఎల్లాజీ తెలిపారు. ఈ చిత్రలేఖనం పోటీలకు సిహెచ్.భాస్కరరావు, పి.మోహనరావు, వ్యాసరచనకు డాక్టర్ విజయవేణి, పద్మ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు చివరి రోజు బహుమతి ప్రదానం ఉంటుందని, కార్యక్రమ నిర్వాహకుల్లో ఒకరైన ఆర్ఎస్ఆర్ మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ కె.రమాదేవి మాట్లాడుతూ, పోటీలో పాల్గొన్న విద్యార్థులకు అల్లూరి జీవిత విశేషాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పివి.రమణ, సతీష్, ఎంఆర్‌డి.రాజు, వై.అప్పారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూతన చట్టాల పట్ల అవగాహన అవసరం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్యాంప్రసాద్ తదితరులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వం నూతనంగా రూపొందించిన కొత్త చట్టాల పట్ల మానవ హక్కు హక్కుల పరిరక్షణ దారులు, పోలీసులు అవగాహన కల్పించుకోవాలని మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాం ప్రసాద్, సోషల్ మీడియా రాష్ట్ర చైర్మన్ సన్‌మూర్తి పిలుపునిచ్చారు. సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ మేరకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నూతన చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) భారతీయ సాక్ష్య అదిన్యం (బిఎస్ఎ), భారతీయ నాగరికత సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) 2023 చట్టాలు జులై 1 నుంచి అమలైన సందర్భంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. 1860 ఇండియన్ క్రిమినల్ ప్రొసీజర్ (ఐపిసి) 1872 ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి) 1973 చట్టాలను సవరిస్తూ 2023లో ఆమోదించిన నూతన చట్టాలను అమలు చేసే దిశలో అవగాహన కల్పించుకోవాలని పిలుపునిచ్చారు. విశ్రాంత పోలీస్ అధికారి, కౌన్సిల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌వి.రమణ మాట్లాడుతూ, గత చట్టాల గురించి పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉన్న పోలీస్ యంత్రాంగం కొత్త చట్టాలను అర్థం చేసుకోవడానికి కొంత సమయం పడుతుందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు కౌన్సిల్ సభ్యులు శకుంతల, సాగర్, బాబు, నారీమణి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దర్శకుడు బిఎస్ చంద్రశేఖర్‌కు నంది అవార్డు
సందేశాత్మక లఘుచిత్రంగా 'ప్రేమా.. నువ్వెక్కడ.?'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, బిఎస్.చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన 'ప్రేమా... నువ్వెక్కడ' షార్ట్ ఫిలిమ్‌కు నంది అవార్డు లభించింది. విశాఖ నగరానికి చెందిన ఈయన, ఆంధ్రప్రభ సీనియర్ జర్నలిస్టు డిఎన్.రాజు బ్యానర్‌పై ఇటీవల గౌరీశేఖర్ బాబు దొంతంశెట్టి నిర్మించిన ప్రేమా నువ్వెక్కడ? లఘు చిత్రానికి కథ,మాటలు, స్క్రీన్ ప్లే దర్శకత్వం వహించినందుకు ఈ అవార్డు లభించింది. భార్యాభర్తలిద్దరూ వేరువేరు వ్యాపకాలలో బిజీగా ఉంటూ పిల్లల్ని పట్టించుకోకుండా కేర్ టేకర్‌పై విడిచి అనుబంధాలకు దూరం కావడం, తాతయ్య వంటి పెద్ద వాళ్లను అనాధాశ్రమాల్లో విడిచి, వారి వల్ల ఈ తరం పిల్లలు కోల్పోతున్న మమతానురాగాలు, ఆప్యాయతలు, బాంధవ్యాలు, అనర్థాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. హైదరాబాద్ మన కళాక్షేత్రం ఫౌండేషన్ ఈ అవార్డును ప్రకటించింది. మంగళవారం త్యాగరాజ గానసభలో నంది పురస్కారాన్ని చంద్రశేఖర్ అందుకున్నారు.

.

పలు పోలీసు కార్యాలయాల్లో సిపి తనిఖీలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రాత బాగ్చి మంగళవారం నగర ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆవరణలో గల పెరేడ్ గ్రౌండ్, మెన్ హ్యాపీ హోం, ఎంటి.ఆఫీసు, ఫైర్ సర్వీస్ ఆఫీసు, బాస్కెట్ బాల్ కోర్టు, టెన్నిస్ కోర్టు, పాపా హోం, డాగ్ కెనాల్, పోలీసు కల్యాణ మండపం, సిటిసి, పోలీసు రీజనల్ ఆసుపత్రి, హోం గార్డ్ యూనిట్, సిఎంఎస్ ఆఫీసు, క్లూస్ టీం కార్యాలయం, పోలీస్ సబ్సిడరీ క్యాంటీన్, ఈస్ట్ ఎసిపి ఆఫీసు, ఐటి కోర్ ఆఫీసు, సిసిఆర్‌బి, ఉమెన్ హోమ్, కమ్యూనికేషన్ ఆఫీసు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆఫీసు, బెల్ ఆఫ్ ఆర్మ్స్, క్వార్టర్ మాస్టర్ స్టార్, ఉమెన్ వెయిటింగ్ హాల్, సెక్యూరిటీ వింగ్ ఆఫీసు, పోలీసు జిమ్, ఎడిసిపి (ఎఆర్), ఎడిసిపి(క్రైమ్స్), ఎడిసిపి(ట్రాఫిక్), ఎసిపి-01 (ఎఆర్), ఎసిపి-02 (ఎఆర్) ఆఫీసు, పోలీసు కాన్ఫరెన్స్ హాల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆవరణలను క్షుణ్ణంగా పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఉద్యానవనాలుగా తీర్చిదిద్దాలని సిపి ఆదేశించారు, అన్ని కార్యాలయాలలో మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి కార్యాలయం వద్దా సిబ్బంది గౌరవ వందనం స్వీకరించిన సిపి ఆయా కార్యాలయాల వద్ద వారు విధులు నిర్వహిస్తున్న తీరు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ కె.ఫకీరప్ప, ఎడిసిపిలు, ఎసిపిలు, ఆర్ఐలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: ప్రజల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని జనరల్ క్లాస్ ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి ఈస్ట్ కోస్ట్ రైల్వే పలు రైళ్లకు అదనపు జనరల్ క్లాస్ కోచ్‌లను శాశ్వత ప్రాతిపదికన జతచేయనున్నారు. 18503 విశాఖపట్నం-సాయినగర్ షిరిడీ రైలుకు ఈ నెల 4వ తేదీ నుంచి, 18504 సాయినగర్ షిరిడీ- విశాఖపట్నం రైలుకు ఈ నెల 5వతేద నుంచి ఒక అదనపు జనరల్ కోచ్‌ను జతచేయనున్నారు. 22869 విశాఖపట్నం- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ రైలుకు ఈ నెల 8వ తేదీ నుంచి, 22870 ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 9వ తేదీ నుంచి ఒక అదనపు జనరల్ క్లాస్ కోచ్‌ను జతచేయనున్నారు. 18447 భువనేశ్వర్-జగ్దల్‌పూర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 4వ తేదీ నుంచి, 18448 జగదల్పూర్-భువనేశ్వర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 5వ తేదీ నుంచి ఒక అదనపు జనరల్ క్లాస్ కోచ్‌ను జతచేయనున్నారు.

IN THE HON'BLE COURT OF THE 1st ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VISAKHAPATNAM
I.A. 35/22 in A.S. 117/2019

Between:
1)Thikki Reddy Danteshwari Varaprasad
2) Thikki Reddy Nagakumari
. . . Appellants
And:
1) Bevara Appala Raju
2) Bayina Srinivasa Rao
. . . Respondents

SUMMONS

To,
Bayina Srinivasa Rao
S/o. Late Venkanna,
Madhurwada Village,
Chinagadili Mandalam, Madhurwada
Visakhapatnam, Andhra Pradesh.

The Appellants filed appeal against the Judgement and decree of the learned Principal Junior Civil Judge Bheemunipatnam Dated 28-2-2019 made in O.S.No. 120/2014 where in you refused to receive the Notices sent by the Hon'ble Court through Court and R.P. Hence this Hon'ble Court ordered to send the notice by way of publication.

Please take notice that the above A.S. 117/2019, I.A. 35/22 is posted to **11-07-2024** for your appearance before the above said court on **10-30 A.M.** failing which the court will pass appropriate order's against you in your absence according to law.

(By Order of the Court)
SANAPALA NARASIMHA SWAMY
Advocate,
39-25-16, Seethanna Gardens,
Madhavadraa, Visakhapatnam.
Cell : 8121360024.

IN THE HON'BLE COURT OF THE IV ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.511/2023

Between:
STATE BANK OF INDIA,
NAD Kotha Road Junction Branch,
Visakhapatnam, Rep. by its
Chief Manager . . . Plaintiff
And:
Sri Gadde Syama Sundaram
...Defendant

SUMMONS

To, **The Defendant:**
Sri Gadde Syama Sundaram,
S/o. G. Danam, aged 58 years,
working in MIR Department,
Naval Dockyard, Visakhapatnam.
R/at D.No. 66-2-53,
Sreeram Nagar, Sriharipuram,
Malkapuram Post,
Visakhapatnam-11.

Please take notice that the plaintiff filed the above suit i.e. O.S.511/2023 for recovery of Personal Loan amount borrowed by the defendant and the above matter stands posted to **22-07-2024** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **22-07-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
BEVARA (K) DEEPTHI SREE,
Advocate
48-5-52, Srinagar,
Visakhapatnam-16.

మహారాజశ్రీ నర్సీపట్నం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No:270/2021

మధ్యన:
1.పైల రమణ . . . వాదులు
మరియు:
1.రుత్తల సత్తిబాబు మరియు . . .ప్రతివాదులు.
టు:
ప్రతివాదులు:
1.రుత్తల సత్తిబాబు, తండ్రి లేట్ నూకన్న, హిందూ, వయస్సు 45 సంవత్సరాలు, మేసన్, పైడిపాల గ్రామం, మాకవరపాలెం మండలం, విశాఖపట్నం జిల్లా.
C/o. రొంగలి మల్లిక, W/o.సంతోష్, కొత్తపాలెం గ్రామం, రాచపల్లి పోస్ట్ మాకవరపాలెం మండలం, విశాఖపట్నం జిల్లా ఆనకాపల్లి జిల్లా.
2.రుత్తల అమ్మాజీ, D/o. లేట్ రమణ, హిందూ, వయస్సు 43 సంవత్సరాలు, సాగు, పైడిపాల గ్రామం, మాకవరపాలెం మండలం, విశాఖపట్నం జిల్లా.
3.రుత్తల దుర్గ D/o. లేట్ రమణ, హిందూ, వయస్సు 16 సంవత్సరాలు, -Rest Do-
4.రుత్తల జయరావు, తండ్రి లేట్ రమణ, హిందూ, వయస్సు 14 సంవత్సరాలు, -Rest Do-

(ప్రతివాది 3 మరియు 4 మైనర్లు అయినందున వారి తల్లి 2వ ప్రతివాది ద్వారా ప్రాతినిధ్యం వహిస్తున్నారు)

జనరల్ నోటీసు

యింధలి వాది 06-02-2015 తనఖా డాక్యుమెంట్ ద్వారాదావా మొత్తాన్ని రికవరీ కోసం వాదికి అనుకూలంగా ప్రాథమిక డిక్రీని పాస్ చేయమని 06-02-2015 కోరుచూ పైకోర్టులో O.S.No. 270/2021గా దావా ధాఖలు చేసినందున, 1టు 4వ ప్రతివాదులుకు యెన్నిసార్లు దావాసమన్లు పంపిననను తీసుకోనందున శ్రీకోర్టు వారు పేపరు పబ్లికేషను ద్వారా నోటీసు పంపమని ఆదేశించినందున ఈపేపరు ద్వారా మీకు నోటిసు పంపడమయినది సదరు విషయములో మీకు ఎట్టి ఆక్షేపణలుయున్నను **తేది 12-07-2024 ఉదయము 10-30 గంటలకు** పైకోర్టు వారి యెదుట స్వయముగా కాని అడ్వకేటు ద్వారా కాని హాజరై తమకు గల ఆక్షేపణలు తెలియ పర్చవలెను. లేనిచో సదరు విషయమై మీ పురోక్షమున విచారించి తీర్మానము చేయుదురని ఈనోటీసు మూలంగా తెలియపర్చుడమైనది.

గొలుసు శంకరరావు
వాది తరుపున న్యాయవాది
సెల్: 9440403999.
నర్సీపట్నం.
తేది:2-7-24

పూరీ రథయాత్రకు ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఒడిశాలోని పూరిలో రథయాత్ర, గుండిచాయాత్ర, బహుదయాత్ర, సునాబేషా సందర్భంగా ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి, ఈస్ట్‌కోస్ట్ రైల్వే హరిపూర్‌గ్రామ్, అర్గుల్ మీదుగా పలు అన్ రిజర్వ్ ప్యాసింజర్ ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 08345 గుణుపూర్-పూరి స్పెషల్ ఈనెల 6,14,16, తేదీలలో గుణుపూర్‌లో రాత్రి 23.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.15 గంటలకు పూరీ చేరుకుంటుంది. 08346 పూరి-గుణుపూర్ ఈనెల 7, 15, 17 తేదీలలో రాత్రి 21.20 గంటలకు పూరిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు గుణుపూర్ చేరుకుంటుంది.

08331 పలాస-పూరి ప్రత్యేక రైలు మీదుగా ఈనెల 07, 15,17 తేదీల్లో అర్ధరాత్రి 12.15 గంటలకు పలాసలో బయలుదేరి, అదే రోజు ఉదయం 5.35 గంటలకు పూరీ చేరుకుంటుంది. 08332 పూరి-పలాస స్పెషల్ ఈనెల 8, 16, 18తేదీలలో ఉదయం 4గంటలకు పూరిలో బయలుదేరి అదే రోజు 10.05 గంటలకు పలాస చేరుకుంటుంది.

08347 విశాఖపట్నం-పూరి ప్రత్యేక రైలు ఈనెల 6, 14, 16 తేదీలలో మధ్యాహ్నం 14.00 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి, అదే రోజు 22:45 గంటలకు గంటలకు పూరీకి చేరుకుంటుంది. 08348 పూరీ-విశాఖపట్నం ప్రత్యేక రైలు ఈనెల 8, 16, 18 తేదీలలో అర్ధరాత్రి 1.45 గంటలకు పూరి నుండి బయలుదేరి అదే రోజు ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

08349 జగదల్‌పూర్-పూరి స్పెషల్ రైలు ఈ నెల 6, 14,16 తేదీలలో ఉదయం 10.45 గంటలకు జగదల్‌పూర్ నుండి బయలుదేరి అదేరోజు అర్ధరాత్రి 00.45 గంటలకు పూరీ చేరుకుంటుంది.08350 పూరీ-జగ్దల్‌పూర్ స్పెషల్ ఈనెల 8, 16, 18 తేదీలలో అర్ధరాత్రి 00.15 గంటలకు పూరి నుండి బయలుదేరి, అదే రోజు మధ్యాహ్నం 15.10 గంటలకు జగదల్‌పూర్ చేరుకుంటుంది.

అప్పన్న సన్నిధిలో రైల్వే జిఎం

ప్రజాశక్తి- సింహాచలం : సింహాచలంలోనివరాహ లక్ష్మీనరసింహస్వామిని భువనేశ్వర్‌లోనిరైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫన్వాల్ దంపతులు మంగళవారం దర్శించుకున్నారు వీరికి ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి పిల్లా శ్రీనువాస్, పిఆర్‌ఓ నాయుడు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో కప్పస్తంభం ఆలింగనం, బేడా మండపం ప్రదక్షణ, స్వామి అంతరాలయంలోనూ గోదాదేవి సన్నిధిలోని గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్థాన మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, స్వామి శేష వస్త్రాలు, ప్రసాదాలను ఎఇఒ ఆనందకుమార్ అందజేశారు. వాల్తేరు డివిజన్ డిఆర్ఎం సౌరబ్ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి- పెందుర్తి : అనారోగ్యంతో తగరపువలస సమీపంలోని సంగివలస అనిల్‌నీరుకొండ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుడు మహ్మద్ అజీమ్‌కు జివిఎంసి 94వ వార్డు 489 సచివాలయ వెల్ఫేర్ అధికారిణి పట్నాల లావణ్యశ్రీ పింఛను అందజేసి తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. ప్రభుత్వం పెంచిన పింఛనుతోపాటు మూడునెలల మిగులు డబ్బులను కలుపుకుని ఈనెలలో రూ.ఏడు వేలు పింఛను ఇస్తుండడం, అదీగాక కొత్త ప్రభుత్వం వచ్చాక మొదటినెల పింఛను కావడంతో తీసుకోకపోతే ఏం జరుగుతుందోనని మహ్మద్ అజీమ్ ఆందోళన చెందుతున్న నేపథ్యంలో సచివాలయ వెల్ఫేర్ అధికారిణి పట్నాల లావణ్యశ్రీ 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న అనిల్ నీరుకొండ ఆసుపత్రికి వచ్చి పింఛను ఇవ్వడంపై ఆనందం వ్యక్తం చేశారు. వెల్ఫేర్ సెక్రటరీ లావణ్యశ్రీ చొరవను అభినందించి, కృతజ్ఞతలు తెలిపారు.

అద్దె బకాయి చెల్లించాలని ఆందోళన

• ఎస్ఆర్ ప్రయివేటు కాలేజీ ఎదుట భవన యజమానుల నిరసన

ఎస్ఆర్ కాలేజీ వద్ద ఆందోళన చేస్తున్న బాధిత యజమానులు

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని గంభీరం పంచాయతీ బోయపాలెం వద్ద ఎస్ఆర్ కళాశాల యాజమాన్యం తమ భవనాన్ని అద్దెకు తీసుకుని 28నెలలుగా అద్దె, బకాయిలు చెల్లించడం లేదని కాలేజీ భవనం ఎదుట బాధితులు కుటుంబంతో సహా మంగళవారం ఆందోళనకు దిగారు. ఎస్ఆర్ విద్యాసంస్థల పేరిట నిర్వహిస్తున్న ప్రయివేటు కాలేజీకి విశాఖకు చెందిన బాదం వెంకటకృష్ణ సత్యనారాయణ, మాధవి, కోటేశ్వరరావు అనే వ్యక్తులు 77వేల చదరపు అడుగుల్లో ఓ భవనం నిర్మించి 2021లో అద్దెకు ఇచ్చారు. తొలుత ఐదు నెలలు పాటు అద్దె సక్రమంగా చెల్లించిన కాలేజీ యాజమాన్యం తర్వాత ఎగ్గొట్టిందని బాధితులు వాపోతున్నారు. భవనాల కోసం తాము వడ్డీలకు అప్పులుచేసి తెచ్చి నిర్మించి ఇచ్చామని, నెలకు రూ. 11,19,420 చొప్పున చెల్లించేలా ఒప్పందం చేసుకున్నామని బాధితులు అంటున్నారు. 28నెలలుగా అద్దె ఇవ్వకపోవడంతో దాదాపు రూ.మూడు కోట్ల వరకు బకాయి ఉందన్నారు. మరోవైపు తాము తెచ్చిన అప్పు, వడ్డీలు చెల్లించాలని బ్యాంకర్లు, రుణదాతలు ఒత్తిడి చేస్తున్నారని, కాలేజీ యాజమాన్యాన్ని అడిగితే కుంటిసాకులు చెపుతూ చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కాలేజీ డిజిఎం పెద్దిరెడ్డి మోహనరెడ్డిని అడిగితే భవనం పనులు సక్రమంగా చేయనందునే అద్దె ఇవ్వడం లేదని, ఏ విషయమైనా కోర్టులోనే తేల్చుకుందామంటూ దురుసుగా మాట్లాడుతున్నారని బాధిత యజమానులు వాపోతున్నారు. విద్యాసంస్థలను నిర్వహిస్తూ, లాభాలు పొందుతున్న వారు, తమకు అద్దె చెల్లింపు విషయంలో అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని,తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. తమకు అద్దె బకాయి చెల్లించకుంటే, తాము చేసిన అప్పులు, వాటి వడ్డీలు కట్టలేని వస్తున్న ఒత్తిళ్లలో ఆత్మహత్యలే శరణ్యమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారిక యాప్, వెబ్‌సైట్లలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

ఆన్‌లైన్ కరెంట్ బిల్లుల చెల్లింపులపై ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ సూచనలు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఎపిఇపిడిసిఎల్ వినియోగదారులు విద్యుత్ బిల్లులను సంస్థ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా చెల్లించవచ్చని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ప్రకటనలో తెలిపారు. రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా మార్గదర్శకాలను అనుసరించి ఇకపై ఫోన్‌పే, గూగుల్‌పే, పేటిఎం, ఇతర యూపిఐ యాప్స్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించేటప్పుడు ఎపిఇపిడిసిఎల్ పేరు కనిపించ దన్నారు. అందుకే విద్యుత్ క వినియోగదారులు సంస్థ మొబైల్ యాప్, eastern powerను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసికొనిగానీ లేదా సంస్థ వెబ్‌సైట్ www.apeasternpower.com ద్వారాగానీ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు. ఎపిఇపిడిసిఎల్ మొబైల్ యాప్‌లోగానీ, లేదా సంస్థ వెబ్‌సైట్‌లో బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు తమ ఫోన్‌పే, గూగుల్‌పే పేటిఎం ఇతర యుపిఐ యాప్స్‌తో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్, క్యాష్ కార్డ్స్ కూడా వాడుకోవచ్చని వినియోగ దారులకు సూచించారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని సిఎండి సూచించారు.

కంటి వైద్యసేవల్లో గణనీయమైన ప్రగతి

• శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి త్రైమాసిక నివేదిక వెల్లడి

ప్రజాశక్తి- వేపగుంట : ఉత్తర కళింగాంధ్ర జిల్లాల్లో రోగులకు నాణ్యమైన కంటి వైద్యసేవలను అందిస్తున్న విశాఖపట్నం నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో వైద్యసేవల పరంగా గణనీయమైన ప్రగతి సాధించిందని సంస్థ డిజిఎం (పిఆర్) కె.బంగారురాజు మంగళవారం ప్రకటనలో తెలిపారు. గడచిన మూడునెలల్లో 8,839 కంటి ఆపరేషన్లు, 50,555 అవుట్‌పేషెంట్లుకు కంటి వైద్యసేవలు రెటినా ఇన్‌ఫెక్షన్స్, గ్లకోమా , కార్నియా , పీడియాట్రిక్ కంటివైద్యం , ఆర్బిట్ అక్యూలోప్లాస్టీ విభాగాలలో మంచిప్రగతిని సాధించిందన్నారు. అలాగే సామాజిక కంటివైద్యసేవల్లో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో మూడునెలల్లో 130 ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించి, 3,265 మందికి కంటి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించి, వారి గమ్యస్థానాలకు పంపించామన్నారు. 1997లో ఆసుపత్రి స్థాపించిన నాటి నుంచి నేటివరకు 4,48,869 కంటి ఆపరేషన్లు, 26,14,402 మంది అవుట్‌పేషెంట్లకు కంటి వైద్య సేవలను అందించడం ద్వారా సరికొత్త మైలురాయిని శంకర్ ఫౌండేషన్ చేరుకుందన్నారు. ఇంతటి ప్రగతికి కారకులైన వైద్యులు, సిబ్బందికి శంకర్ ఫౌండేషన్ ట్రస్టీలు ఆత్మకూరు కృష్ణకుమార్, ఆత్మకూరు విజయ్‌కుమార్ అభినందనలు తెలిపారు సంస్థ జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్ అభినందించారు.

ప్రతిభకు నగదు బహుమతి

బహుమతి ఇస్తున్న లెక్చరర్ మాధవి

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు ఛాత్రోపాధ్యాయులకు డైట్ అధ్యాపకులు జె మాధవి తన సొంత నిధులను ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. మంగళ వారం కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ఛాత్రోపాధ్యాయులు రొంగలి శ్యామల, హరిప్రియ, సమీరబాలలకు ప్రిన్సిపాల్ ఎం జ్యోతి కుమారి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎల్ సుధాకర్, నాగేశ్వరరావు, మాధవి, త్రినాథరావు, జి రవి పాల్గొన్నారు

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గిడిజాల ఎంపిపి పాఠశాల, లక్ష్మీదేవిపేట, దిబ్బడిపాలెం పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులతో కూడిన స్టూడెంట్ కిట్లను మండల పరిషత్ ఉపాధ్యక్షులు పాండ్రంగి శ్రీను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగపరచుకొని ఉన్నతంగా చదవాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయినుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ప్రణాళికాబద్ధంగా, పట్టుదలతో కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో సర్పంచ్ శినగ అప్పలరాజు, మాజీ సర్పంచ్ కోరాడ రాము, ఉపసర్పంచ్ సోమునాయుడు, మాజీ ఎంపిటిసి శినగం వెంకటరావు పాల్గొన్నారు

డిగ్రీలో ప్రవేశాలకు
10వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి -భీమునిపట్నం:స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు ఈనెల10 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ విష్ణుమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమిలి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బిఎ, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, బికాం, కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎస్‌సి కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ గ్రూపులతో కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు

ఘనంగా వేపాడమ్మ తల్లి పండగ

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 95వ వార్డు పోర్లపాలెం గ్రామంలో వేపాడమ్మ తల్లి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదవితరణ చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, టిడిపి నాయకులు గల్లా వెంకటరమణ, ఇతర నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రహరీని ఆనుకుని ఉన్న గేటును ఎమ్మెల్యే రమేష్‌బాబు ప్రారంభించారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

విశ్రాంత ఎఎన్ఎమ్‌కు సత్కారం

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి మలేరియా విభాగంలో ఎఎన్ఎంగా విశేషసేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన పద్మావతిని ఎనిమిదో జోన్ మలేరియా ఇన్‌స్పెక్టర్ దాలినాయుడు ఆధ్వర్యంలో మలేరియా సిబ్బంది మంగళవారం ఆత్మీయసత్కారం చేశారు. కార్యక్రమంలో ఎనిమిదో జోన్ వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు, శానిటేషన్ సూపర్‌వైజర్ రమణ, వెంకటస్వామి, జివిఎంసి సిబ్బంది పాల్గొని పద్మావతి సేవలను కొనియాడారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- వేపగుంట : కొత్త విద్యుత్ లైన్ నిర్మాణం, ఇతర నిర్వహణ పనుల దృష్ట్యా ఎపిఇపిడిసిఎల్ వేపగుంట సబ్‌స్టేషన్ పరిధిలోని పద్మనాభపురం, బంటాకాలనీ 11కెవి ఫీడర్ పరిధిలో ఈనెల 3న బుధవారం ఉదయం 9.గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని సంస్థ మూడవ జోన్ ఆపరేషన్స్ ఇఇ పోలాకి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. బంటాకాలనీ, మేఘాద్రిగెడ్డ కాలనీ, అప్పలనరసయ్య కాలనీ, వెంకటసాయి నగర్, రవినగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పరామర్శించిన డిప్యూటీ మేయర్

ప్రజాశక్తి- వేపగుంట : అనారోగ్యంతో బాధపడుతున్న జివిఎంసి 52వ వార్డు శానిటేషన్ సూపర్‌వైజర్ వెదుళ్ల శ్రీనును నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మంగళవారం పరామర్శించారు. అనారోగ్యంతో శ్రీను బాధపడుతున్న విషయం తెలుసుకున్న డిప్యూటీ మేయర్, న్యాకరాపాలెంలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి, యోగక్షేమాలను అడిగితెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

శ్మశానవాటికలో పిచ్చిమొక్కల తొలగింపు

పిచ్చిమొక్కలను తొలగిస్తున్న ప్రొక్లెయినర్

ప్రజాశక్తి-పిఎం.పాలెం: జివిఎంసి ఆరో వార్డు కొమ్మాది విలేజ్ సమీపంలో శ్మశానవాటికలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను స్థానిక వార్డు కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక చొరవతో మంగళవారం తొలగింపు చర్యలు చేపట్టారు.శ్మశానానికి వెళ్లే మార్గంలో ఇరువైపులా, అలాగే శ్మశానవాటికలోనూ విపరీతంగా తుప్పలు పెరిగిపోవడంతో, దహన సంస్కారాలకు వెళ్లేటప్పుడు ఇబ్బందులు పడే పరిస్థితి ఉది.దీనిపై స్థానికులు వినతిమేరకు కార్పొరేటర్ లక్ష్మీప్రియాంక స్పందించి, ప్రొక్లెయినర్‌తో పిచ్చిమొక్కలు తొలగించే చర్యలు చేపట్టారు.దీనిపై స్థానికులు హర్షం వ్యక్తంచేస్తూ, కార్పొరేటర్ లక్ష్మీప్రియాంకకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే శ్మశానం ప్రధాన ద్వారం వద్ద గేటు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కొమ్మాది నాయకులు కనకరాజు సియ్యాద్రి, గుంటుబోయిన శ్రీనివాస్ యాదవ్, మధు, కృష్ణ, రాజు, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు జూపార్కుకు కొత్త నేస్తాల రాక

ప్రజాశక్తి - ఆరిలోవ : గుజరాత్‌లోని జమ్నాగర్ గ్రీన్స్ జులాజికల్ రెస్క్యూ అండ్ రీహెబిటేషన్ సెంటర్, రాధాకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్టుల మధ్య కుదిరిన జంతు మార్పిడి ఒప్పందం ద్వారా విశాఖలోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు బుధవారం కొత్త జంతువులు, పక్షులు రానున్నట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ జూ పార్కుకు స్ట్రిప్డ్ హైనాలు రెండు, హాగ్ డీర్ ఒక జత, పెయింటెడ్ స్టార్క్, గ్రే పెలికాన్, స్టార్ తాబేళ్లు, ఘరియాల్, జంగిల్ క్యాట్స్, ఢోలే, తోడేళ్ళు, గార్‌లు రానున్నట్లు తెలిపారు. విశాఖ జూపార్కు నుంచి కామన్ మార్మోసెట్, స్కార్లెట్ మాక్వా, గ్రీన్ వింగ్డ్ మాక్వా, మీడియం సల్ఫర్ కాకూ, స్క్విరెల్ మంకీస్, స్లెండర్ టైల్డ్ మీర్ కాట్, రెడ్ నెక్డ్ వాల్బేలు గుజరాత్ జూపార్కుకు తీసుకువెళతారన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించండి

• అధికారులకు ఎమ్మెల్యే పంచకర్ల ఆదేశం

వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి- పెందుర్తి: ప్రజాసమస్యలపై అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆదేశించారు. మంగళవారం జివిఎంసి 88వ వార్డు జగ్గయ్యపాలెం దుర్గానగర్ ప్రాంతాలలో పర్యటించారు.డ్రైనేజీ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తేగా, తగు పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమస్యలుంటే తన దృష్టికి తేవాలని, వాటి సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జెడ్‌సి, జివిఎంసి ఇఇ, ఇతర అధికారులతోపాటు 88 వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, బుదిరెడ్డి శివ, ఎం.అర్జున్, పి.భాను, పి.మురళీకృష్ణ గోపి కుమార్, శ్యామ్, భాగ్యరాజు, వినోద్, అచ్యుత్, చక్రి సత్తిబాబు, బుల్ రాజు, బాలు, మురళి, జనసేన, టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేద రోగికి మందులు వితరణ

రోగికి మందులు అందజేస్తున్న సేవాస్ఫూర్తి సభ్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : రవీంద్రనగర్ కేంద్రంగా సేవలందిస్తున్న సేవాస్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ పేదరికంలో మగ్గుతున్న రోగికి మంగళవారంమందులు అందజేసారు. బిఎన్‌ఆర్ నగర్‌లో ఉంటున్న లక్ష్మీ తీవ్ర అనారోగ్యంతో మంచాన పడి వుంది. విషయం తెలుసుకున్న సేవాస్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ సభ్యులు బాధితురాలికి నెలకు సరిపడే కిరాణా సామగ్రిని ఇటీవల అందజేసిన విషయం తెలిసిందే. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు ఇపుడు నెలకు సరిపడా మందులు అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు, సభ్యులు ఎం.ప్రకాష్ పాత్రుడు, ఎస్.ఆనంద్, కె.నానాజీ, రామకృష్ణ పాల్గొన్నారు.

పోర్టులను సందర్శించిన తూర్పు కోస్తా రైల్వే జిఎం

• శాఖాపరమైన పరస్పర సహకారంపై అధికారుల చర్చలు

రైల్వే జిఎం పరమేశ్వర్‌ను అభినందిస్తున్న పోర్టు అథారిటీ చైర్మన్ అంగముత్తు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో/ ఎంవిపి కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీలో ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్, వాల్టేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, ముఖ్య ఆపరేషన్స్ మేనేజర్ వై.నాగేంద్ర బాబులతో కూడిన బృందం మంగళవారంపర్యటించింది. రైల్వే అధికారుల బృందానికి పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.ఆంగముత్తు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోర్టులో రైల్వే సైడింగ్స్‌ను తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ తనిఖీ చేశారు, ట్రాక్ నిర్వహణ, సిగ్నలింగ్, ఇతర నిర్వహణ 'అంశాలపై ఆరా తీశారు. విశాఖపట్నం కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా పోర్టు చైర్‌పర్సన్ అంగముత్తు, ఈస్టుకోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ పలు అంశాలపై చర్చించారు. రైల్వే లైన్‌ల ఎలక్ట్రిఫికేషన్, నవీనీకరణ, ఎక్కువ బోగీల వినియోగం, రైల్వే ద్వారా సరుకు తరలింపు వంటి వివిధ రైల్వే సమస్యలపై అధికారులిద్దరూ చర్చించారు. అల్యూమినియం, వ్యవసాయ ఉత్పత్తులు, బొగ్గు, ఇతర ముఖ్యమైన వస్తువుల రవాణాలో వృద్ధిపై చర్చించారు. రైల్వేలు, పోర్ట్ అభివృద్ధికి పరస్పర సహకార ప్రాముఖ్యతను గుర్తించారు..

అనంతరం అదానీ గంగవరం పోర్టును కూడా రైల్వే జిఎం సందర్శించారు. తర్వాత డిఆర్‌ఎం కార్యాలయ సమావేశ మందిరంలో రైల్వే డివిజనల్ అధికారులతో సమావేశమై, పలు అభివృద్ధి కార్యక్రమాలు, పురోగతిలో ఉన్న పలు ప్రాజెక్టులపై చర్చించారు.

ముగిసిన మొదటి విడత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

శిక్షణ పొందిన విద్యార్థులతో కరస్పాండెంట్ ప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి- విశాఖపట్నం : నగరంలోని కృష్ణరాయ పురంలోని ఆంధ్ర అగ్రికల్చర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో మొదటి లెవెల్ కమ్యూనికేషన్ స్కిల్స్ డెవలప్‌మెంట్ శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిసాయి. ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి విడత శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా ఆంధ్ర అగ్రికల్చర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల కరస్పాండెంట్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ, తమ కాలేజీలో ఏటా30మంది విద్యార్థులకు ఇటువంటి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని, తద్వారా వారు మంచి కంపెనీల్లో ఉద్యోగం సంపాదించి, స్థిరపడాలన్నదే కాలేజీ ఉద్దేశ్యమన్నారు.కమ్యూనికేషన్ స్కిల్స్ డెవలప్‌మెంట్, స్కిల్స్ ప్రజెంటేషన్, సెల్ఫ్ అసెస్మెంట్ స్కిల్స్ డెవలప్‌మెంట్ ఇలా 15 అంశాలపై విద్యార్థులకు శిక్షణనిచ్చినట్లు తెలిపారు. రెండో లెవెల్ స్కిల్స్ డెవలపెమెంట్ తరగతులన్ ప్రారంభిస్తున్నామని, ఈ విడతలోనూ 30 మందికే శిక్షణనిస్తాన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్‌పై శిక్షణనిచ్చేందుకు తమ కాలేజీలో అనుభవిజ్ఞులైన అధ్యాపకులు ఉన్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం తమ కాలేజీలో బిఎస్‌సి అగ్రికల్చర్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఉన్నతి ఫౌండేషన్ చైర్మన్ రమేష్‌స్వామి, కళాశాల ప్రిన్సిపాల్ నిహారిక, అధ్యాపకులు జ్యోతి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు

ముగిసిన దివీస్ ఛాలెంజర్స్ క్రికెట్ టోర్నీ

• విజేతగా అమనాం బాల్ బర్నర్స్ • రన్నరప్‌గా చిప్పాడ కూల్ థండర్స్

టోర్నీ విజేతలతో దివీస్ సంస్థ ఎండి మురళీకృష్ణ

ప్రజాశక్తి-తగరపువలస : భీమిలి మండలం, మూలకుద్దులో చిప్పాడ దివీస్ సంస్థ ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న దివీస్ చాలెంజర్స్ క్రికెట్ మెగా టోర్నీ మంగళవారంతో ముగిసింది. మండలంలోని 12 పంచాయతీల నుంచి 32 జట్లు పాల్గొన్న ఈ టోర్నీ విజేతగా అమనాం బాల్‌బర్నర్స్ జట్టు నిలిచింది. రన్నరప్ చిప్పాడ కూల్ థండర్స్ జట్టు నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు.విజేతలకు దివీస్ సంస్థ ఎండి మురళీకృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్‌వి రమణ, జిఎం వైఎస్ కోటేశ్వర రావు, సిఐ డి.రమేష్ , సిఎస్‌ఆర్ మేనేజర్ సురేష్‌కుమార్ జ్ఞాపికలు, నగదు బహుమతులు అందజేశారు.

దివీస్ సంస్థ ఆధ్వర్యంలో విజేత అమనాం జట్టుకు రూ 50 వేలు, రన్నరప్ చిప్పాడ జట్టుకు రూ.25 వేలు, మూడు నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు చెరో రూ.పది వేలు, మ్యాన్ ఆఫ్‌ది సీరిస్‌గా ప్రతిభ చాటిన క్రీడాకారునికి రూ.ఐదు వేలు నగదు బహుమతులు అందజేశారు గ్రామీణ యువకుల్లో క్రీడా నైపుణ్యం పెంపుదలకు, యువ క్రీడా కారులను ప్రోత్సహించేందుకు తమ సంస్థ ఈ తరహా టోర్నమెంట్‌లను నిర్వహిస్తుందని సంస్థ ఎండి మురళీకృష్ణ స్పష్టం చేశారు. విజేతలను అభినందించారు

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

సాయం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి - భీమునిపట్నం : పాడేరు ఘాట్ రోడ్డులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు, తీవ్రగాయాలై చికిత్స పొందుతున్న వారికి జివిఎంసి నాలుగోవార్డు కె.నగరపాలేనికి చెందిన శ్రీ దుర్గాదేవి సప్లయర్స్, లై టింగ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రూ 20 వేలు ఆర్థికసాయం అందజేశారు కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఎల్లాజీ, కార్యదర్శులు నరసింగరావు, నాగరాజు కోశాధికారి జి నూకరాజు పాల్గొన్నారు

వికలాంగ క్రీడాకారులకు అభినందన

చెస్ విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : గతనెలలో ఆల్ ఇండియా టాటా స్టీల్ ఫౌండేషన్ నిర్వహించిన చెస్ టోర్నీలో స్వర్ణ, రజత పతకాలను సాధించిన వికలాంగ క్రీడాకారులను పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అభినందించారు. మంగళవారం గోపాలపట్నంలోని ఎమ్మెల్యే గణబాబును ఆయన స్వగృహంలో వికలాంగ చెస్ క్రీడాకారులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనను కలిసిన చెస్‌పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన విశాఖకు చెందిన క్రీడాకారుడు కోన ఏసుబాబు, రజత పతకం సాధించిన నవీన్‌కుమార్‌లను ఎమ్మెల్యే అభినందించారు. భవిష్యత్‌లోమరిన్ని టోర్నీల్లో రాణించి, అంతర్జాతీయ, జాతీయస్థాయి కీర్తిని పొందాలని ఆకాంక్షించారు.

కాగా వివిధ రాష్ట్రాలకు చెందిన 164మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ చెస్ టోర్నీలో విశాఖ క్రీడాకారులిద్దరూ మంచి ప్రతిభ కనబరిచి ఏసుబాబుకు బంగారుపతకం, నవీన్‌కుమార్‌కు రజత పతకం రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే గణబాబు ప్రోత్సాహంతోనే తాము చెస్ పోటీల్లో విజయం సాధించామని క్రీడాకారులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ సురవరపు రమణ సుబ్బారావు, వెంకటరమణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనగర్‌లో సమస్యలపై పరిశీలన

గోపాలపట్నం : జివిఎంసి 91వ వార్డు గోపాలపట్నం దరి లక్ష్మినగర్‌లో ఎమ్మెల్యే గణబాబు మంగళవారం ఉదయం అధికారులతో కలిసి పర్యటించారు. ఇటీవల వర్షానికి దెబ్బతిన్న ప్రహరీ, వీధి రోడ్లను పరిశీలించి, వీలైనంత త్వరగా పునర్నిర్మించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు నారిపిన్ని సత్తిరాజు, బంగారు తులసిరామ్, దాడి రమేష్‌నాయుడు, కనకకుమార్, అలజంగి శ్రీను, బోనెల రామకృష్ణ, అల్లం రమేష్, బొత్స శ్రీను, కొండపాలాసపిల్లి రమేష్, పుచ్చా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాఘవకుమారి సేవలు స్ఫూర్తిదాయకం

రాఘవకుమారిని సత్కరిస్తున్న డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి -ఆనందపురం: స్థానిక పిహెచ్‌సి ఆరోగ్య పర్యవేక్షకులుగా పనిచేసిన ఉద్యోగ విరమణ చేసిన రాఘవకుమారి సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో రాఘవకుమారి ఉద్యోగ విరమణ అభినందన సభలో మాట్లాడుతూ వైద్యశాఖలో సీనియర్లు ఎంతోకష్టబడి పనిచేసేవారని వారిని చూసి నేటి తరం నేర్చుకోవాలన్నారు. వైద్యాధికారి డాక్డర్ ఎం.గంగునాయుడు మాట్లాడుతూ, తన పనితీరుతో రాఘవకుమారి అధికారుల మన్ననలు పొందారని కొనియాడారు.

కార్యక్రమంలో రాఘవ కుమారి సోదరి, రంగస్థల, సినీ నటి ఆలపాటి లక్ష్మి, సిహెచ్‌ఒ పి సాంబమూర్తి, రేవిడి పిహెచ్‌సి ఎంపిహెచ్‌ఇఒ శ్రీనివాస్, జిల్లా కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం, ఆరోగ్య పర్యవేక్షకులు పార్వతమ్మ, కృష్ణ మోహన్, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు

జగన్నాథస్వామి రథోత్సవం ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రూ.8 కోట్ల రుణాలు కాజేసిన

వెలుగు, బ్యాంకు అధికారులను అరెస్టు చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

- డిఆర్‌డిఎ కార్యాలయం ఎదుట బాధిత డ్వాక్రా మహిళల ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండలం సత్యనారాయణపురం, కొత్తూరు, మూలపేట పంచాయితీల్లో నకిలీ డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి బ్యాంకు రుణాలు కాజేసిన వెలుగు, బ్యాంకు సిబ్బందిని అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, బాధితదులకు న్యాయం చేయాలని కోరుతూ అనకాపల్లి డిఆర్‌డిఎ కార్యాలయం వద్ద సిపిఎం, ఐద్వా అధ్వర్యంలో మంగళవారం డ్వాక్రా మహిళలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లోనాథం మాట్లాడుతూ ఈ అవినీతిపై ఫిర్యాదు చేసి 6 నెలలైనా ఇప్పటివరకూ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. దీంతో ప్రభుత్వం పథకాలు బాధిత డ్వాక్రా మహిళలకు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, వెలుగు, డిఆర్‌డిఎ , బ్యాంకు ఉన్నత అధికారులు సమన్వయం చేసుకొని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ సత్య నారాయణపురం, కోత్తూరు పంచాయితీల్లో విఒఎ గ్రూపు సభ్యులకు తెలియకుండా నకిలీ గ్రూపులను ఏర్పాటు చేసి అనకాపల్లి బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెడిఎఫ్‌సి బ్యాంకు, బ్యాంకు ఆఫ్ బరోడా తదితర బ్యాంకుల్లో సుమారు 8 కోట్లు రూపాయలు అవినీతికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో వెలుగు, బ్యాంకు అధికారుల పాత్రపై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డ్వాక్రా సభ్యులకు సంబంధం లేకుండా ఈ వ్యవహారం జరిగింది కనుకు బాధిత సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై స్పందించి చర్యలు చేపట్టాలని లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి వరలక్ష్మి మండల సమాఖ్య ద్వారా రుణాలు మంజూరు చెల్లింపులు తదితర అన్ని కార్యకలాపాలు జరగాల్సివుండగా నిబంధనలకు విరుద్ధంగా పై మోసానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అద్యక్షులు రుత్తల శంకర్రావు, ఐద్వా నాయకులు జి.సుభాషిని, బాధిత మహిళలు నందిక నాగమణి, ఉపమాక లక్ష్మి, బోడి ఝాన్సీ, బొబ్బిలి గాయత్రి, నందిక విజయ, ఆకులు దేవ, ఉప్పాటి అప్పలరాజు పాల్గొన్నారు.

డిఆర్‌డిఎ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం, ఐద్వా నేతలు, డ్వాక్రా మహిళలు

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రజాశక్తి -అనకాపల్లి

ఈనెల 7వ తేదీన జరగనున్న శ్రీజగన్నాథ స్వామి రథోత్సవ వేడుకల నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆలయ సిబ్బంది, అధికారులతో కలసి గూడ్స్ రోడ్డు వద్ద గల ఇంద్రజ్యుమ్న హాలును సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. సత్వరమే ఉత్సవానికి కావలసినటువంటి ఏర్పాట్లు పూర్తి చేయాలని తగు సూచించారు. ఈ సంవత్సరానికి ఈ ఉత్సవం అయిన వెంటనే ఈ ప్రాంతంలో ఒక మంచి కళ్యాణ మండపం నిర్మించి ఈ ప్రాంత వాసులకు, జగన్నాథ స్వామి పండుగకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చేస్తామని తెలియజేశారు. ప్రణాళికాబద్ధంగా ఈ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి కావలసిన ఏర్పాట్లు త్వరలోనే చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రమేష్

విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి -కశింకోట : విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని మండలంలోని తాళ్ళపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి యు.రమేష్ అన్నారు. మంగళవారం గురుకుల పాఠశాలలో స్టాప్ డయేరియాపై బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కాచి చల్లార్చిన నీరు తాగాలని, ఓఆర్ఎస్ ద్రావణం సేవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గ్రేస్, ఆరోగ్య బోధకలు ప్రసాద్, ఎంపిహెచ్ఇ ఓ నరసింగరావు, ఏఎన్ఎం అన్నమ్మ, ఆర్‌వి సత్య నారాయణ, విద్యార్థులు, వెద్య సిబ్బంది పాల్గొన్నారు.

అశ్రద్ధ వహించకుండా శిక్షణ పొందాలి

ప్రజాశక్తి-చోడవరం

శిక్షణ శిబిరంలో ఉపాధ్యాయులు అశ్రద్ధ వహించకుండా శిక్షణ పొందాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 9 రోజుల పాటు జరిగే టీచ్ టూల్ శిక్షణ కేంద్రాన్ని రెండో రోజు మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు శత శాతం సర్టిఫైడ్ అబ్జర్వర్‌గా ఉత్తీర్ణత సాధించాలని కోరారు. విద్యార్థులలో ఉన్న విషయ వెనుకబాటు తనాన్ని తగ్గించడానికి కృషి చేయాలన్నారు. శిక్షణా కేంద్రాన్ని జిల్లా కో ఆర్డినేటర్లు షకీల్, నీతికా సందర్శించి ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ రామిరెడ్డి, వెంకటేశ్వరరావు, మాస్టర్ ట్రైనీలు జగన్నాధరావు, ఉదయ భాస్కర్, బొంజిబాబు, సముద్రం, కుమార్ సతీష్ పాల్గొన్నారు·

మాట్లాడుతున్న డిఇఒ వెంకటలక్ష్మమ్మ

అల్లూరికి ఇచ్చే గౌరవం ఇదేనా?

ప్రజాశక్తి-అనకాపల్లి

భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారిని గడగడలాడించిన మన్యం వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు విగ్రహం చెత్త చెదారంతో నిండిపోయింది. రెండు రోజుల్లో ఆయన జయంతి వస్తున్నా అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామం ఆర్‌ఎసిఎస్ కార్యాలయం వద్ద ఉన్న అల్లూరి విగ్రహ పరిసరాలను శుభ్రం చేయలేదు. అల్లూరి విగ్రహం పరిసరాలను వెంటనే శుభ్రం చేసి ఆ మహా నాయకుడికి తగిన గౌరవం ఇవ్వాలని, దీనిపై పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

తుమ్మపాల మెయిన్ రోడ్‌లో చెత్తలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం

అందరి సహకారంతో అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలలోని ప్రజాప్రతినిధులు, ప్రజలు, నాయకుల సహాయ సహకారాలతో మండలాభివృద్ధికి కృషి చేస్తానని ఇన్చార్జి ఎంపీడీవో ఎస్.అప్పలరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇన్చార్జి ఎంపీడీవోగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని దేవరాపల్లి, ముషిడిపల్లి, కెఎం.పాలెం, ఎ. కొత్తపల్లిలో మండల ప్రత్యేక అధికారి వి.రవీంద్రనాథ్‌తో కలిసి పర్యవేక్షించినట్లు చెప్పారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న అప్పలరాజు

4న దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - యలమంచిలి

ఒన్ నేషన్ - ఒన్ ఎగ్జామ్ ముసుగులో మొత్తం పరీక్ష వ్యవస్థనే కుప్పకూల్చారని, విద్యార్థుల భవిష్యత్తు ఆపదలో పడిందని ఆందోళన వ్యక్తం చేస్తూ ఎస్ఎఫ్ఐ, ఇతర విద్యార్థి సంఘాల పిలుపు మేరకు ఈ నెల 4న జరుగు దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ పిలుపు మేరకు విద్యసంస్థలన్నీ బంద్ పాటించాలని స్థానిక ఎంఇఓ మీనాక్షికి మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. జూలై 4 న కేజీ నుండి పీజీ వరకు విద్యాసంస్థలన్నీ మూసివేసి నిరసనలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాలాజీ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయ పరీక్షలు నిర్వహించడంలో విఫలమైందన్నారు. లక్షల మంది విద్యార్థులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా విద్యార్థిలోకం తరగతులు బహిష్కరించి బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చోడవరం-ఆనందపురం బస్సులు నడపాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు

చోడవరం నుంచి ఆనందపురం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సిపిఎం మండల నాయకులు ఎర్ర దేవుడు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నిత్యం ఆనందపురం నుంచి చోడవరానికి వందలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని, బస్సు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేటు వాహనాలైన ఆటోలను అనుసరించవలసి వస్తుందని, దీంతో సమయానికి ప్రయాణం సాగడం లేదని, అధిక చార్జీలు చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనందపురం నుంచి చోడవరం ప్రతినిత్యం కాలేజీకి వెళ్లే విద్యార్థులు కోర్టు పనిమీద చోడవరం వెళ్లేవారు సరైన వాహన సౌకర్యాలు లేక నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నూతన ప్రభుత్వం చోడవరం నుంచి అనంతపురం వరకు ఆర్టీసీ బస్సును నడపాలని ఆయన కోరారు.

పింఛన్ల పంపిణీలో సబ్బవరం ప్రథమ స్థానం

ప్రజాశక్తి-సబ్బవరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో 99.49శాతంతో జిల్లాలోనే సబ్బవరం మండలం అగ్రగామిగా నిలిచిందని ఇన్చార్జి ఎంపీడీవో ఒ.మహేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 8238 మంది పింఛనుదారులు ఉండగా వారిలో 8196 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. 28 మంది పింఛనుదార్లు మృతి చెందగా, ఇంకా 14 మందికి మాత్రమే పంపిణీ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీలో విధులను సమర్థవంతంగా నిర్వహించారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రశంసించినట్లు చెప్పారు.

మొక్కల పెంపకం ఆవశ్యకతపై అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తేగాడ కెజిబివిలో బాలికలకు మొక్కలు పెంపకం ఆవశ్యకత, దాని వల్ల ప్రయోజనాలపై గుంటూరుకు చెందిన ఎపి జీవ వైవిధ్య మండలి, లూపిన్ ఫార్మా కంపెనీ, శారదావేలీ డెవలప్మెంట్ సమితి సంయుక్తంగా మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శారద వ్యాలీ డెవలప్మెంట్ సమితి ఆపరేషన్ మేనేజర్ బుదిరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల జీవవైవిద్యానికి, పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దొండా చంద్రకళ, శారద వాలీ డెవలప్మెంట్ సమితి ఆపరేషన్ మేనేజర్ కర్రీ చైతన్య, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు సిబ్బంది చక్రవర్తి, జయ, జివిల్ నాయుడు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో ఆధునిక సదుపాయాలు కల్పిస్తాం

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలిలో కొత్తగా నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటరును ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. తులసీనగర్‌లో కొత్తగా నిర్మించిన సిహెచ్‌సిని మంగళవారం ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ల అభిప్రాయం కూడా తీసుకున్నారు. ఆసుపత్రికి రావడానికి రోగులు పడుతున్న ఇబ్బందులు కూడా వివరించారు. అన్నీ విన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాదాయ స్థలం అందుబాటులో ఉంది కదా అని ప్రజలకు అందుబాటులో లేని స్థలంలో ఆసుపత్రి నిర్మించడం గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత చర్యగా ఆయన విమర్శించారు. రోడ్డు వెడల్పు గురించి టిపిఒ శ్రీలక్ష్మిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. తోవలోని ఇళ్లను క్రమబద్ధీకరించి తులసీనగర్ రోడ్డును వెడల్పు చేస్తామన్నారు. కేవలం 30 శాతం ఆసుపత్రి నిర్మాణం చేసి అందులోకి ఆసుపత్రిని తరలించడం సరికాదన్నారు. డాక్టర్లు, సిబ్బంది, రోగులు అందరూ ఇబ్బంది పడుతుండడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. అనంతరం మెయిన్‌రోడ్డులోని పాత ఆసుపత్రిని సందర్శించి అపరిశుభ్రంగా ఉండడం పట్ల వార్డు శానిటరీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ సుభాష్, గైనకాలజిస్టు డాక్టర్ నీహారిక, కార్యకర్తలు కొఠారు సాంబ, ఆడారి రమణబాబు తదితరులు హాజరయ్యారు.

ఆసుపత్రి వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-చోడవరం : గ్రామాల్లో అతిసారవ్యాధి రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. మంగళవారం గవరవరం పీహెచ్సీ వద్ద స్టాప్ డయేరియా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు అపరశుభ్రత వలన డయేరియా వ్యాపించే అవకాశం ఉందన్నారు. సచివాలయం, వైద్య సిబ్బంది పరిశుభ్రతపై తగు సలహాలు సూచనలు అందించాలని, ఎప్పటికప్పుడు గ్రామాల్లో బీజింగ్ పౌడర్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ప్రదీప్, దీపిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చెక్కల శ్రీను జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ నాయకులు కారణం శ్రీనివాసరావు (చెక్కల శ్రీను) జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీనును శాసనసభ్యులు కొణతాల రామకృష్ణతో పాటు పలువురు టిడిపి నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, టిడిపి నాయకులు మళ్ల సురేంద్ర, పోలవరపు త్రినాధ్, డాక్టర్ నారాయణరావు, కర్రి బాబి, కొణతాల శ్రీనివాసరావు, నడిపల్లి గణేష్, మావిడి సన్యాసిరావు, బొడ్డపాటి రాజారావు, గొర్లి శ్రీనివాసరావు, ఆకుల శ్రీనివాసరావు, వియ్యపు సింహాచలం, పి.మురళి శ్రీనివాసరావు, బుదిరెడ్డి సూరిబాబు పాల్గొన్నారు.

ఊడేరులో గ్రామసభ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని ఊడేరు గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. పంచాయితీకి వచ్చిన జల్ జీవన మిషన్ నిధులు సక్రమంగా వినియోగించారా? ఇంటింటికి తాగునీరు కొళాయిలు వేశారా ? పంచాయితీ సరఫరా చేసే నీరు శుద్ధమైన జలమేనా? తాగునీరుస్తున్నారా సాగునీరుస్తున్నారా అని గ్రామస్తులు పంచాయితీ పాలకవర్గాన్ని నిలదీసారు. ఊడేరు గ్రామంలో ఆనుకొని సర్వేనెంబర్ 211లో గల కొండ సుమారు 538 హెక్టార్లు విస్తీర్ణంలో ఉన్న కొండ చుట్టూ బోర్డర్ నిర్ణయించి పంట భూములకి కొండకి మధ్య సరిహద్దులు నిర్ణయించి, అన్యాక్రాంతమైన కొండ పోరంబోకుని స్వాధీనం చేసుకుని గ్రామంలో బడుగు బలహీనవర్గాలైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని గ్రామసభలో తీర్మానించారు. పంచాయతీలో ఉన్న చెరువు ఆయకట్టును కాపాడేందుకు చెరువుకొచ్చే కొండ వాగులను పరిరక్షించుటకు పంచాయతీ తీర్మానం చేసింది. సమావేశంలో సర్పంచు కృష్ణమోహన్, మాజీ సర్పంచ్ దండుపాటి గంగరాజు, ఇంటి సూరిబాబు, ఇంటి తాతారావు, జగదీష్ పాల్గొన్నారు.

తుంపాలమ్మను దర్శించుకున్న కొణతాల

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం అచ్చర్ల గ్రామంలో తుంపాలమ్మ అమ్మవారి పండగ సందర్భంగా అనకాపల్లి ఎంఎల్ఏ కొణతాల రామకృష్ణ మంగళవారం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దొడ్డి నాగేశ్వరరావు, టిడిపి నాయకులు నైనంశెట్టి రమణరావు, నిమ్మదల సన్యాసి నాయడు, కర్రి సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుచ్చయ్యపేట ఎస్సై డి ఈశ్వరరావు మంగళవారం వాహనాల తనిఖీని ముమ్మరం చేశారు. రాజాం, బుచ్చయ్యపేట జంక్షన్ తదితర ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు లేని పలు వాహనాలపై కేసులు నమోదు చేశారు.

ఆసుపత్రుల్లో పింఛన్లు అందజేత

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : పింఛన్ల పంపిణీ రెండో రోజు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది పంఛన్లు పంపిణీ చేశారు. మండలంలోని తైపురం సచివాలయ సిబ్బంది అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న వారికి పెన్షన్లను అందజేశారు. దిబ్బిడి పంచాయతీ కార్యదర్శి సాయి విశాఖపట్నం కేజీహెచ్ వైద్యం పొందుతున్న లోవరాజు అనే వ్యక్తికి మంగళవారం పెన్షన్ పంపిణీ చేశారు.

కెజిహెచ్‌లో పింఛను అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి సాయి

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో తాడిలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు

గ్రామాన్ని తరలించే వరకు ఉచితంగా మంచినీరు సరఫరా

తాగునీటిని అందజేస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి -పరవాడ

పరవాడ మండలం ఫార్మాసిటీ కాలుష్యంతో తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్న తాడి గ్రామంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేశారు. జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ వి అయ్యప్ప నాయుడు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ పివి.ముకుందరావు మంగళవారం ఆర్వో వాటర్ ప్లాంట్ ద్వారా ఉచిత మంచినీరు సరఫరా కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని రాంకీ ఫౌండేషన్ ద్వారా ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. గ్రామాన్ని తరలించే వరకు ప్రతి ఇంటికి రోజుకు 20 లీటర్లు నీటిని ఉచితంగా సరఫరా చేయడానికి అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మాదంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బొడ్డపెల్లి అప్పారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఫార్మా బల్క్ డ్రగ్స్ అసోసియేషన్ ప్రతినిధులు కె.సుబ్బారావు, రామేశ్వరరావు, కోమటి సూరిబాబు, పైలా కృష్ణ, సాలాపు రమణ, గండ్రెడ్డి కనకరాజు, గుమ్మాల రాము, టి.శ్రీను, కోమటి అచ్చిబాబు, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీకాంత్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నివారణకు అంతర్గత కమిటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి

పది లేదా అంతకన్నా ఎక్కువ ఉద్యోగులు (ఆడ లేక మగ) పనిచేసే చోట లైంగిక వేధింపుల నివారణకు అంతర్గత కమిటీ కచ్చితంగా ఏర్పాటు చేయాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అనకాపల్లి జిల్లా పథక సంచాలకులు, సాధికారత అధికారి కె.అనంతలక్ష్మి ఆదేశించారు. లైంగిక వేధింపుల చట్టం-2013 కోసం అనంతలక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా, డివిజినల్, మున్సిపల్, మండల స్థాయి అధికారులతో మంగళవారం వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలలో లైంగిక వేధింపుల నుంచి మహిళలకు రక్షణ కల్పించడానికి పోష్ యాక్ట్ 2013 చట్టాన్ని అమలు చేయాల్సిందేనని ఆదేశించారు. కంప్లైంట్ బాక్స్ అందుబాటులో ఉంచాలన్నారు. అంతర్గత కమిటీలు ఏర్పాటు చేసి ఆ వివరాలను మహిళ, శిశు సంక్షేమ కార్యాలయానికి అందజేయాలని, ప్రతి నెల శాఖల వారిగా నివేదికలు అందజేయాలని అధికారులను కోరారు. కమిటీలు ఏర్పాటు చేయని సంస్థలపై 50 వేలు వరకు జరిమానా విధించడానికి వెనుకాడమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అనకాపల్లి జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇసుక గుట్టలపై మైన్స్ అధికారుల దాడి

అక్రమ నిల్వ ఉంచిన ఇసుక కుప్పలు సీజ్

ప్రజాశక్తి-చోడవరం

మండలంలోని ముద్దుర్తి గ్రామంలో అనకాపల్లి మైన్స్ సహాయ సంచాలకులు సుబ్బారాయుడు ఆధ్వర్యాన మంగళవారం ఇసుక గుట్టలపై దాడి చేశారు. ముద్దుర్తి గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మైన్స్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో, నీటి పారుదల శాఖ, పోలీస్, రెవిన్యూ అధికారులు దాడి చేసి ముద్దుర్తి సంఘమేశ్వర గుడి దగ్గర మూడు ఇసుక బండ్లను పట్టుకున్నారు. ఒక్కొక్క బండికి రూ. 2వేలు చొప్పున రూ.6వేలు అపరాధ రుసుము వసూలు చేశారు. ఎదురుగా ఉన్న జీరాయితి భూమి మామిడితోటలో ఉన్న ఇసుక కుప్పలను స్వాధీనం చేసుకున్నారు. నదిలోంచి ఇసుక తీస్తున్న వారికి హెచ్చరికలు చేసి నోటీసులు జారీ చేశారు. ఇదే పునరావృతమైతే ట్రైర్ బండికి రూ.10వేలు చ చొప్పున జరిమానా విధిస్తామని హెచ్చరించారు. సీజ్ చేసిన ఇసుక కుప్పలను రెవిన్యూ, ఎస్ఈబి శాఖల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మైన్స్ రాయల్టీ ఇన్స్పెక్టర్ స్వాతి, ఎస్ఈబి, ఇరిగేషన్, పోలీస్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఇసుక గుట్టలను పరిశీలిస్తున్న అధికారులు

మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్మాణ్ సంస్థ సౌజన్యంతో మంగళవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ జాబ్ మేళాలో 12 కంపెనీలు పాల్గొన్నాయి. 256 మంది రిజిస్టర్ పొందగా, 117 మంది విద్యార్థులను వివిధ కంపెనీలు ఎంపిక చేసుకున్నట్లు నిర్మాణ సంస్థ ప్లేస్మెంట్ మేనేజర్ సిహెచ్ శ్రీధర్ తెలిపారు. ఎంపికైన వారికి నిర్వాహకులు ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌ల చేతుల మీదుగా నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ హెచ్ సుదీర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కిరణ్ కుమార్, సీనియర్ అధ్యాపకులు ఐవివి.సత్యవతి, వెన్నెల అప్పలనాయుడు, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వివి రత్నభారతి, డి.మాల్యాద్రి, బిచ్చమ్మ పాల్గొన్నారు.

కలిగొట్ల పాల సంఘం అధ్యక్షునిగా కురసా

ప్రజాశక్తి-దేవరాపలి : మండలంలోని కలిగొట్ల విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షుడిగా కురసా నారాయణదాసు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన నారాయణదాసును టిడిపి మండల మాజీ అధ్యక్షుడు బండారు రామారావు, పాల సంఘం మాజీ అధ్యక్షుడు గొర్రెపోటు నరసింహమూర్తి, జనసేన మండల అధ్యక్షుడు గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు, దొగ్గ దేముడునాయుడు, పలువురు నాయకులు సాలువాతో సత్కరించి అభినందించారు.

పాల సొసైటీ పాలకవర్గ సభ్యులు, రైతులు

పార్మాసిటీలో ఉపాధి కల్పించాలని మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి- పరవాడ : పరవాడ పార్మసిటీ కంపెనీల్లో మత్స్యకారులకు ఉద్యోగాలు, ప్యాకేజీ తక్షణమే అందించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పార్మసిటీ వద్ద మత్స్యకారులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు మాట్లాడుతూ పార్మా వ్యర్థాలు ఉప్పుటేరులోనూ, సముద్రంలోనూ కలవడం వలన మత్స్యసంపద మృత్యువాత పడుతుందని, దీంతో ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, జాలారిపేట, సమ్మంగిపాలెం గ్రామాల ప్రజల జీవనాధారమైన చేపల వేట లేకపోవడంతో ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య వ్యర్థాలు విడుదల చేస్తున్న ఫార్మా, రాంకీ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం డిఆర్‌ఒకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి అర్జిల్లి రవిదేవి, నాయకులు మైలపల్లి అప్పన్న, చింతకాయల అమ్మోరు, సూరాడ ముత్యాలరావు, కోవిరి పెద్ద ముత్యాలు, కోవిరి రాయుడు, అర్జిల్లి అప్పారావు, సమ్మంగి సోమేశ్వరరావు, ఒలిశెట్టి అప్పలరాజు, మైలపల్లి బంగారురాజు, చింతకాయల మహేష్, చింతకాయల అప్పారావు, అర్జిల్లి బంగారి తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రభుత్వమైనా.. సమస్యలు పరిష్కరించేనా?

కాంపెక్స్ సమీపాన మురుగునీరు

- మెరుగుపడని డ్రైనేజీ
- ముందుకు కదలని రిజర్వాయర్ల ప్రతిపాదనలు
మరమ్మతుకు నోచుకోని అల్లూరి పార్కు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో సుమారు 10 సంవత్సరాల నుండి పరిష్కారం కాని దీర్ఘకాలిక సమస్యలను కొత్త ప్రభుత్వం చర్యలు చేపట్టి పరిష్కరించాలని పలువురు కోరుకుంటున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో స్థానిక ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు మండలంలో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని పలువురు కోరారు.

మండలంలో మేజర్ పంచాయతీ ఎ.ఎల్ పురం లో నిత్యం అపారిశుద్ధ్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. పదేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వంలో 5.5 కోట్ల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు నిమిత్తం ప్రతిపాదనలు చేశారు. దీనికి సంబంధించిన పంచాయితీ వాటా దనం కూడా అప్పట్లో సిద్ధం చేసి ఉంచారు. అది గత ప్రభుత్వంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోక పోవడంతో నేటికీ పంచాయతీలో పారిశుధ్య సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

ప్రతి ఏడాది వర్షాకాలంలో మురుగునీరుతో కలిసి రోడ్లపైకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడున్నారు. ప్రస్తుత ప్రభుత్వం గతంలో ప్రతిపాదించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలపై దృష్టి సారిస్తే పారిశుద్ధ్య సమస్య పూర్తిగా పరిష్కారం చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడ వచ్చు.

కలగా రిజర్వాయర్

మండలంలో కొత్త యల్లవరం పంచాయతీ జిల్లేడిపూడి వద్ద తాబేలు పణుకు రిజర్వాయర్ ను ఏర్పాటు చేస్తే సుమారు 1200 ఎకరాల వ్యవసాయ భూమి కి సాగునీరు అందుతుందని ఇరిగేషన్, ఇంజనీరింగ్ అధికారులు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 20 సంవత్సరాల క్రితం నుంచి ఈ రిజర్వాయర్ పనులు ప్రతిపాదన కే పరిమితమైన పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో భూసేకరణ భూసేకరణ గాను కొంత సొమ్ము మంజూరు చేసి పనులు ప్రారంభించే సమయంలో ప్రభుత్వం మారింది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రిజర్వాయర్ ప్రతిపాదనను పక్కన పెట్టింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఈ రిజర్వాయర్‌ను పూర్తి చేస్తే సుమారు ఆరు గ్రామాల కు చెందిన పలువురు రైతులు ఆర్థికంగా స్థిరపడడమే కాకుండా తెదేపా ప్రభుత్వం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండిపోయే అవకాశం ఉంటుంది.

అభివృద్ధికి నోచుకోని అల్లూరి పార్క్

మండలంలో ఏఎల్ పురంలో ఉన్న అల్లూరి ఘాట్ గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మాత్రమే పార్క్ నిర్మాణం చేసి సమాధులను ఆధునికరించి

అల్లూరి పార్కులో శిథిలావస్థలో ఉన్న ప్రగోడాలు

రిజర్వాయర్ ఏర్పాటు చేయాల్సిన ప్రదేశం

కొంతమేర సుందరవనంగా తీర్చిదిద్దారు. గత పదేళ్ళుగా పార్కులో శిథిలమైన కట్టడాలకు, అప్పట్లో ఏర్పాటు చేసిన ప్రగోడాలు(షెడ్ లు) శిథిలమైనప్పటికీ గత ప్రభుత్వంలో ఎటువంటి మరమ్మతులు చేయించలేదు. టూరిజం ఆధ్వర్యంలో 50 లక్షలు మంజూరు చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరు చేయక పార్కు అభివద్ధికి సంబంధించి ఒక ఒక్క పని కూడా నెరవేరలేదు. అయితే పార్కులో పని చేసే కాపలాదారులకు మాత్రం గత ప్రభుత్వం వేతనాలను ఏర్పాటు చేసింది. స్థానికంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన చింతకాయల అయ్యన్న పాత్రుడికి అల్లూరు పార్క్ అంటే ఎప్పుడు ప్రత్యేకమైన శ్రద్ధ కనబరుస్తారు. గతంలో పార్కును అభివృద్ధి చేసిన తెలుగుదేశం ప్రభుత్వం అధికారం లోకి రావడం, అయ్యన్న ఎమ్మెల్యే కావడంతో ఈ ప్రాంతీయలంతా చారిత్రాత్మక ప్రాంతమైన అల్లూరి పార్కు అభివృద్ధి కావడం ఖాయమని అనుకుంటున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మేజర్ పంచాయతీలో సమస్యలను పరిష్కరించాలి. వర్షాకాలం వస్తే దోమలు అధికమవుతుండటంతో అనారోగ్యాల పాలవుతున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టి మేజర్ పంచాయతీలో పారిశుధ్య సమస్యకు పూర్తి పరిష్కారం చూపాలి.

సాపిరెడ్డి నారాయణ మూర్తి, సిపిఎం మండల కార్యదర్శి, కృష్ణదేవిపేట, గొలుగొండ.

ఆశాలకు ఎలక్షన్ డ్యూటీ పారితోషికం చెల్లించాలి

ప్రజాశక్తి-కశింకోట

ఈ ఏడాది మేలో జరిగిన సాధారణ ఎన్నికలలో విధులు నిర్వహించిన ఆశా కార్యకర్తలకు పారితోషికం చెల్లించాలని కోరుతూ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన మంగళవారం కసింకోట, తాళ్లపాలెం పిహెచ్‌సిల వైద్యాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి, నాయకులు పద్మ, కుమారి, సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా సబ్బవరం, విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎన్నికలు విధులు నిర్వహించిన ఆశా కార్యకర్తలకు రోజుకు 200 చొప్పున పారితోషికం ఇచ్చారని, తమకు కూడా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె నూకరత్నం, రవణమ్మ, కే.లక్ష్మి, శ్రీదేవి, రామలక్ష్మి, పార్వతి, దేవి, సీత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

యలమంచిలి : ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఆశా కార్యకర్తలకు పారితోషికం ఇవ్వలేదని కోరుతూ మండలంలోని సోమలింగపాలెం, పెద్దపల్లి, రేగుపాలెం ఆరోగ్య కేంద్రాల అధికార్లకు మంగళవారం వినతి పత్రాలు సమర్పించారు. ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఆశాకార్యకర్తలను చిన్నచూపు చూడడం సబబుకాదని, వారికి గౌరవంగా పారితోషికం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు బుజ్జి, గోపి, జయ, లక్ష్మి, సత్యవతి, సిఐటియు నాయకులు సిహెచ్ శివాజీ, సోమునాయుడు, కనకం, సత్యవతి పాల్గొన్నారు.

యలమంచిలిలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దేవరాపల్లి : ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల వద్ద ఆశా కార్యకర్తలను మెడికల్ క్యాంపు నిమిత్తం డ్యూటీలు వేశారని, వారికి పారితోషికం చెల్లించాలని దేవరాపల్లి మండల కేంద్రంలో అశావర్కుర్లు వైద్య అదికారికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పద్మ, సుజాత, వరలక్ష్మి, ఈశ్వరమ్మ, జ్యోతి, కమల, అధిక సంఖ్యలో అశా కార్యకర్తలు పల్గొన్నారు.

చీడికాడ: ఎన్నికల డ్యూటీ పారితోషికాన్ని ఆశా కార్యకర్తలకు చెల్లించాలని చీడికాడ, పెద్ద గోవాడ ఆశా వర్కర్లు వైద్య అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు డివిజన్ కార్యదర్శి ఆర్ దేముడు నాయుడు మాట్లాడుతూ,అనకాపల్లి జిల్లాలో సబ్బవరం మండలం మినహా ఎక్కడా కూడా పారితోషకం చెల్లించలేదన్నారు. ఈ కార్యక్రమంలో మంగమ్మ, సత్యవతి, ఈశ్వరమ్మ, కమల కుమారి, దేవుళ్ళమ్మ, దేవి పాల్గొన్నారు.

చీడికాడలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిఘంటువును బహూకరిస్తున్న పడాల వీరభద్రరావు

మైత్రీ గ్రంథాలయానికి నిఘంటువు బహూకరణ

ప్రజాశక్తి-గొలుగొండ: స్థానిక అల్లూరి సీతారామరాజు మైత్రీ గ్రంథాలయానికి ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల వీరభద్రరావు ఎంతో విలువైన శంకర్ నారాయణ డిక్షనరీని బహుకరించారు. మంగళవారం స్థానిక అల్లూరి స్మారక పార్కును సందర్శించడానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా పడాల వీరభద్రరావు మాట్లాడుతూ, విలువైన ఇంగ్లీషు, తెలుగు, హిందీ శంకర నారాయణ డిక్షనరీ హైస్కూలు, డిగ్రీ విద్యార్థులకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు మనవడు అల్లూరి శ్రీరామరాజు, మాదేటి రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మాదేటి రవి ప్రకాష్, జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యదర్శులు అంబటి వరహాల రాజు, లక్కాకుల బాబ్జి, శ్యామల వరలక్ష్మి, పల్లా భాస్కరమణి, లైబ్రరీ నిర్వాహకులు రమణ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి -గొలుగొండ : కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని నర్సీపట్నం సిఐ హరి సూచించారు. మండలంలోని జోగంపేట, గొలుగొండ, కేడీపేట గ్రామాలలో మంగళవారం యువతకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐపీసీని బీఎన్ఎస్ గాను సిఆర్పిసిని బిఎన్ఎస్ఎస్ గాను మార్పు చేయడంపై ఆయన ప్రజలకు వివరించారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కలిగించే విధంగా యువత తమ సహకారాన్ని అందించాలన్నారు. గొలుగొండ, కేడీపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో నాటు సారా తయారీ, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే పోలీసులకు తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఎస్సై కృష్ణారావు, కేడీపేట ఎస్సై ఉపేంద్ర పాల్గొన్నారు.

ఆన్‌లైన్ చేయించుకుంటున్న మత్స్యకారులు

మత్స్యకార సొసైటీ ఓటర్ల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేట సచివాలయంలో మంగళవారం ఫిషరీస్ విలేజ్ అసిస్టెంట్ కే త్రినాథ్ మత్స్యకార సొసైటీ పాత ఓటర్ల ఆన్లైన్ వెరిఫికేషన్ నిర్వహించారు. మత్స్యకార సొసైటీ ప్రెసిడెంట్ పిక్కి కోదండరావు ఆధ్వర్యంలో ఓటర్లు వెరిఫికేషన్ చేయించుకున్నారు. మత్స్యకార సొసైటీ పాత ఓటర్లు పాస్ ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్, ఆధార్ లింక్ అయిన ఫోన్ తీసుకువచ్చి ఓటును ఆన్లైన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పిక్కి సత్తియ, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, నాయకులు బొంది బాబురావు, మడ్డు జోగిరాజు, వాసపల్లి అప్పారావు, జనసేన నాయకులు కోదండరావు (బుజ్జి), గుర్రన్న పాల్గొన్నారు.

కెడిపేట డిఆర్ఒగా సత్యనారాయణ

ప్రజాశక్తి- గొలుగొండ: అటవీ శాఖ కేడీపేట రేంజ్ డి ఆర్వోగా సత్యనారాయణను ఉన్నతాధికారులు నియమించారు. ఇక్కడ డిఆర్ఓగా గతంలో పని చేసిన రాజేష్ పదోన్నతి పై వెళ్లారు. అప్పటినుండి ఇన్చార్జి డిఆర్ఓగా గొలుగొండ సెక్షన్ అధికారి లక్ష్మణరావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నర్సీపట్నం సెక్షనాధికారిగా పని చేస్తున్న సత్యనారాయణను పదోన్నతి పై మంగళవారం కేడీపేట డిఆర్ఓగా పంపారు.

కేసు పత్రాన్ని ఇస్తున్న పోలీసులు

ఇరువురిపై బైండోవర్ కేసు నమోదు

ప్రజాశక్తి-కోటవురట్ల: కోటఉరట్ల మర్రిచెట్టు సెంటర్ వద్ద జరిగిన వివాదం పై ఇరు వర్గాల నుండి స్థానిక పోలీస్ స్టేషన్కు అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు ఇరు వర్గాలపై మంగళవారం బైండోవర్ కేసు నమోదు చేశారు. ఇకపై ఇరువురు ఎటువంటి వివాదాలకు పాల్పడరాదని రెవెన్యూ ఉప తహసిల్దార్ బానోజీరావు, రైటర్ చంద్రశేఖర్ సూచించారు. బైండోవర్ కేసు పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, చట్టాలను అతిక్రమించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు కోటవురట్ల మండల సమావేశం

ప్రజాశక్తి-కోటవురట్ల: ఇటీవల జరిగిన సార్వత్రికల ఎన్నికల అనంతరం ఈనెల 3న బుధవారం తొలిసారిగా మండల సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఎటువంటి అసౌకర్యం మండల పరిషత్ అధికారులు ఏర్పాట్లు చేశారు. మండల పరిషత్ వ్యవస్థ ఏర్పడిన పిమ్మట తొలిసారిగా మండలంలో టిడిపి మెజార్టీ రావడంతో జరగనున్న సమావేశం పట్ల చర్చ సాగుతుంది.

పింఛను ఇస్తున్న మహిళా పోలీస్

విశాఖ వెళ్లి పింఛన్లు ఇచ్చిన సిబ్బంది

ప్రజాశక్తి - చీడికాడ: ఇటీవల ప్రమాదంలో గాయపడి విశాఖపట్నం కింగ్ జార్జ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి సచివాలయం మహిళా పోలీస్ వృద్ధాప్య పెన్షన్ అందించారు. మండలంలోని జైతవరం గ్రామానికి చెందిన రెడ్డి దేవుడి బాబు ఇటీవల ప్రమాదానికి గురయ్యాడు. కేజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మహిళ పోలీస్ సుధారాణి విశాఖపట్నం వెళ్లి బాధితుడికి 7 వేలు అందించారు.

గొలుగొండ: తన విధులను ముగించుకున్నానంతరం 100 కిలోమీటర్లు వెళ్లి లబ్ధిదారునికి పింఛన్ అందజేశారు. మండలంలో జోగంపేట సచివాలయ పరిధిలో అగ్రికల్చరల్ అసిస్టెంట్గా పనిచేస్తున్న సత్యవేణి సోమవారం రాత్రి వైజాగ్ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు.

ఒక్క రోజులోనే పింఛన్ల పంపిణీపై హర్షం

ప్రజాశక్తి-చింతపల్లి: ఒక్క రోజులోనే పింఛన్లు పంపిణీ చేసిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందని టిడిపి మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు కిలో పూర్ణచంద్రరావు, ఆంద్రాబు లక్ష్మణ్, సీనియర్ నాయకుడు గొల్లోరి మంగు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ, గడచిన ఐదేళ్లలో ఏనాడు ఐదు రోజుల లోపు పెన్షన్ పంపిణీని పూర్తి చేయలేదన్నారు.

ఆకట్టుకున్న భూకైలాస్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: శ్రీ భానోదయ నాట్య మండలి (సురభి) హైదరాబాద్ సభ్యులు సురభి 140వ వార్షికోత్సవం సందర్భంగా కళాభారతి ప్రాంగణంలో 4వ రోజు మంగళవారం భూకైలాస్ నాటకం ప్రదర్శించారు. నాటకంలో ప్రధానంగా రావణుడి ప్రణాళికలకు భయపడిన ఇంద్రుడు నారదుని సహాయం కోరడం, రావణుని కోరికను తీర్చడానికి శివుడు రావణునికి కనిపించినప్పుడు, విష్ణువు, రావణుడి మనసును తారుమారు చేసి పార్వతీ దేవిని కోరుకునేలా చేయటం, రావణుడు తపస్సు చేసి శివుని ఆత్మలింగాన్ని తన తల్లి కోసం తీసుకురావాలని ప్రయత్నం చేయటం, పార్వతీదేవి కైలాసానికి రావటం, పార్వతీదేవి విష్ణువును శాపగ్రస్తుడిని చేయటం, చివరిగా రావణుడిని మోసగించి ఆత్మ లింగాన్ని నేలమట్టం చేయటం వంటి సన్నివేశాలను ప్రదర్శించారు. రావణాసురుడు పాత్రధారి మోహన్కృష్ణ, పార్వతి పాత్రధారి ప్రసూన, మహా విష్ణువు పాత్రధారి హరి శివకృష్ణ, శివుడి పాత్రధారి నాగబాబు ఆద్యంతం రసవత్తరంగా ప్రదర్శించారు. ఈ నాటకానికి నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ నటీనటులు సహకారాన్ని అందించారు.

నాటికలో సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

కళా నైపుణ్యం అద్వితీయం

సురభి నాటక కుటుంబీకుల కళా నైపుణ్యం అద్వితీయమని ఆంధ్ర విశ్వ కళాపరిషత్ రంగస్థల విభాగం అధ్యాపకులు డాక్టర్ మీగడ శశిభూషణ స్వామి పేర్కొన్నారు. ఈ నాటక ప్రదర్శనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాటక రంగం పరిరక్షణలో బాదంగీర్ సాయి ప్రయత్నం నిత్య ఆదర్శనీయమని కొనియాడారు. ఎన్ఎస్ఆర్ సమర్థ నిర్వహణ హర్షణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర విశాఖ రచయితల సంఘం కార్యదర్శి అడపా రామకృష్ణ, కళాభినయ వ్యవస్థాపకులు కవిప్రసాద్, నంది అవార్డు గ్రహీత డేవిడ్రాజు, సహృది సాహితీ ప్రధాన కార్యదర్శి సిహెచ్.చిన్న సూర్యనారాయణ, హాస్య ప్రియ కామెడీ క్లబ్ కార్యదర్శి ఇమంది ఈశ్వరరావు, జ్యోతి సరళ నాటక పరిషత్తు అధ్యక్షులు రామారావు, సాయి కళానికేతన్ గౌరవ అధ్యక్షులు అప్పలనాయుడు, రంగస్థలం నటి సంధ్యా ప్రియదర్శిని, శివ జ్యోతి, ఆశపు హైమావతి, నాంచారయ్య, హెచ్పిసిఎల్ పూర్వ అధికారి శర్మం పాల్గొన్నారు.

వ్యవసాయంలో 'నిశ్శబ్ద విప్లవం

రాశి మిత్ర సహకారంతో ఆధునిక పద్ధతులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వ్యవసాయంలో నిశ్శబ్ద విప్లవం చోటు చేసుకుందని, సంప్రదాయ వ్యవసాయంలోని సంక్లిష్టతలకు ఇది స్వస్తి పలికేలా చేసిందని, ఆధునిక వ్యవసాయ పద్ధతుల వైపు వెళ్లేలా చేసిందని, దీంతో రైతులు అధిక దిగుబడులు సాధిస్తూ, లాభాలను చవిచూస్తున్నారని, రాశి మిత్రతో ఇది సాకారం అవుతుందని రాశి సీడ్స్ కాటన్ బిజినెస్ మార్కెటింగ్ హెడ్ సత్యనారాయణరావు తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాశి మిత్రలో నమోదు చేసుకున్న రైతుల వ్యవసాయ నైపుణ్యాన్ని పెంపొందించడమే కాకుండా పర్యావరణ వ్యవస్థను సానుకూలంగా ప్రభావితం చేస్తున్నామని తెలిపారు. ఇప్పుడు రాశి మిత్రతో అడుగులు వేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారన్నారు. అధిక నాణ్యత గల హైబ్రిడ్ విత్తనాలను ఉత్పత్తి చేయడంలో రాశి మిత్ర ప్రత్యేకత కలిగి ఉందని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో 4 పతకాలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఆంధ్రప్రదేశ్ వూషు అసోసియేషన్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో గత నెల 27, 28 తేదీలలో నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి జూనియర్ యూత్ వూషు ఛాంపియన్షిప్ టోర్నమెంట్లో నర్సీపట్నం నింజాస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు రెండు స్వర్ణ పతకాలు, రెండు కాంస్య పతకాలు సాధించారు. 60 కిలోల విభాగంలో విత్తనాల లోకేష్, 56 కేజీల విభాగంలో రౌతు నాగలక్ష్మి స్వర్ణ పతకాలు సాధించగా, 52 కిలోల విభాగంలో బొమ్మల రాజరాజేశ్వరి, 46 కిలోల విభాగంలో అప్పికొండ వంశీ కాంస్య పతకాలు సాధించారు. ఈ టోర్నమెంట్ లో స్వర్ణ పతకాలు సాధించిన క్రీడాకారులు జూలై 26న కోయంబత్తూరు లో జరిగే జాతీయ వూషు పోటీలలో పాల్గొంటారని సీనియర్ కోచ్ యర్రా శేఖర్ తెలిపారు. పతకాలు గెలుచుకున్న క్రీడాకారులను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మంగళవారం అభినందించారు. నర్సీపట్నంలో క్రీడాభివృద్ధికి తగిన సహాయం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ క్రీడాకారిణి మౌనిక, రాష్ట్ర టీం మేనేజర్ విజయ్ పాల్గొన్నారు.

ప్రశాంతా పత్రాన్ని ఇస్తున్న విజయ్

అల్లూరి జయంతిపై ఆర్డిఒ సమీక్ష

ప్రజాశక్తి -గొలుగొండ : మండలంలో ఈనెల 4న ఎఎల్ పురం అల్లూరి పార్కులో నిర్వహించే అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలపై మంగళవారం నర్సీపట్నం ఆర్డిఓ జయరాం పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేడుకల్లో నిర్వహించే విద్యార్థుల ర్యాలీ, వేదిక ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు, పార్కు ముస్తాబు, అతిథులను ఆహ్వానించే విధానం బహుమతుల ప్రధానోత్సవం వంటి అంశాలపై ఆయన అధికారులతో చర్చించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే అల్లూరి జయంతి వేడుకలు పకడ్బందీగా జరగాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ జడ్పిటిసి చిటికలు తారక వేణుగోపాల్, నర్సీపట్నం రూరల్ సీఐ హరి, ఎంపీడీవో రత్నకుమారి, డిప్యూటీ తహసిల్దార్ రాజ్ భరత్, కేడీపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నర్సీపట్నం ఆర్డీవో జయరాం

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ